ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఏప్రిల్ 02, 2017



NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838

మనం సంతోషానికి దూరం

కాల్పనిక కథా చిత్రాలు





బాలీవుడ్ చిత్రాల్లో కాల్పానిక కథల (ఫెయిరీ టేల్స్) ఆధారితంగా వచ్చిన చిత్రాల గురించి మీకు తెలుసా...? అదేనండీ 'అరేబియన్ నైట్స్', 'సింద్ బాద్ ది సెయిలర్', 'అలాడిన్', 'సిండ్రెల్లా' లాంటి కాల్పనిక కథల ఆధారంగా వచ్చిన సినిమాలన్న మాట. హాలీవుడ్ చిత్రాల్లో కొత్త ఒరవడిని సృష్టించిన ఈ కథలన్నీ కొన్ని బాలీవుడ్ చిత్రాల్లోనూ భాగమయ్యాయి అవేంటో మీరే తెలుసుకోండి. మాట్లాడే పక్షులు, జలకన్యలు, అద్భుత దీపాలు, రెక్కల గుర్రాలు ఇవన్నీ ప్రేక్షకులని అబ్బురపరిచే అంశాలే. అవే ఫెయిరీ టేల్స్ ప్రత్యేకతలు... 1970ల నాటి బాలీవుడ్ కథల్లో ఈ ట్రెండ్ ప్రవేశించింది. 1975లో విడుదలైన 'రాణీ లాల్ పరి' 'వండర్‌ల్యాండ్ డౌన్ ది ర్యాబిట్ హోల్' కాల్పనిక కథ ఆధారంగా తీసిన తొలి బాలీవుడ్ చిత్రం. ఫిరోజ్ ఖాన్, జగ్‌దీప్, అరుణా ఇరానీ, రీనా రాయ్ లాంటి అగ్రనటులున్న ఈ చిత్రంలో నీతూ సింగ్ (సిండ్రెలా), జితేంద్ర (ప్రిన్స్) పాత్రల్లో కనిపిస్తారు. అలా వండర్‌ల్యాండ్ కథలన్నీ మరెన్నో బాలీవుడ్ చిత్ర సన్నివేశాల్లో భాగమయ్యాయి. ఇండో-రష్యన్ నిర్మాణంలో 1980లో వచ్చిన 'ఆలీబాబా ఔర్ చాలీస్ చోర్' చిత్రం అరేబియన్ నైట్ ఆధారంగా తీసినదే... 1980ల నాటి బాలీవుడ్ చిత్ర సన్నివేశాల్లో 1001 అరేబియన్ నైట్స్ కథలు కనిపిస్తూనే వుంటాయి. ఇక 90లనాటి ట్రెండ్‌లో 'సిండ్రెల్లా' భాగమయ్యింది. 1993లో ఆ పాత్ర ఆధారంగా వచ్చిన చిత్రం 'అన్‌మోల్' మనీషా కొయిరాలాకి పేరు తెచ్చిపెట్టింది. 'రపున్‌జల్' కథ ఆధారంగా 2002లో విడుదలైన చిత్రం 'ఆప్ ముఝే అచ్చే లగ్‌నే లగే'. హ్రితిక్, అమీషా పటేల్ జంటగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద పల్టీ కొట్టేసింది. అరేబియన్ నైట్స్‌లోని 'సింద్‌బాద్ ది సెయిలర్' పాత్ర స్ఫూర్తితో నాటి 'హాతిమ్ తాయ్' నుంచి 2008 నాటి 'రాక్ ఆన్' చిత్రాల దాకా లీడ్ రోల్స్‌లో చేరిపోయాయి. ఇక అలాడిన్ అద్భుత దీపం కథ ఆధారంగా 2009లో వచ్చిన చిత్రం 'అలాడిన్'. ఈ చిత్రంలో రితేష్ అలాడిన్ పాత్ర పోషిస్తే జీని పాత్రలో అందరినీ మెప్పించారు బిగ్ బి. ఇలా బాలీవుడ్‌లో కొంతకాలం నడిచిన కాల్పనిక కథలు, ఊసులు ఇప్పుడు మళ్ళీ బాలీవుడ్‌లో వినపడుతున్నాయి. ఫెయిరీ టేల్స్ ఆధారంగా ఓ కొత్త చిత్రం త్వరలో రాబోతోందన్న మాట. దర్శకులు రాధికా రావ్, వినయ్ సప్రూలు 'స్నో వైట్ అండ్ ది సెవెన్ డ్వార్ఫ్స్' కథ ఆధారంగా ఓ చిత్రాన్ని రూపొందిస్తామని ఎప్పుడో ప్రకటించేశారు. ఫిల్మ్‌మేకర్ అశుతోష్ గోవారికర్ కూడా ఇదే పనిలో ఉన్నాడట.

ఆ ఆర్నాల్డ్‌కు మించి



వ్యక్తిగత ప్రతిభతో వందలాది మంది ప్రముఖులు చరిత్రకెక్కిన ఉదంతాలు ఎన్నో చదివాం... చూశాము. ఇతడూ ప్రముఖుడే కానీ కథే కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. జీవిత పోరాటం చేసి గెలిచినవారివందరివీ విలక్షణ బతుకు పోరాటాలే. కానీ ఈ ఆర్నాల్డ్‌ది ఇంకాస్త డిఫరెంట్. హాలీవుడ్‌కు చెందిన ఆ ఆర్నాల్డ్ స్టోరీకి మించిన కథా వస్తువ దొరుకుతుంది. టీనేజ్‌లోనే బాడీ బిల్డర్‌గా ఓ టైటిల్‌ను అందుకుని ఎంతో ఉన్నతంగా ఎదగాలనుకున్న ఈ ఆర్నాల్డ్‌ను క్యాన్సర్, పక్షవాతం కదలకుండా చేశాయి. రెండు కాళ్లు చచ్చుబడి జీవిత కలల్ని అడ్డంగా విరిచేసింది. మనోబలంతో వైకల్యాన్ని అధిగమించి. బలహీనతను దరి చేరనీయకుండా దేన్నైనా సాధించ వచ్చునని నిరూపించి... 'ఇండియా ఆర్నాల్డ్'గా ఖ్యాతి గడించాడు. పంజాబ్‌కు చెందిన 29 ఏళ్ల ఆనంద్ ఆర్నాల్డ్ భారత్‌లో తొలి వీల్‌చైర్ బాడీ బిల్డర్‌గా విజేతగా నిలిచాడు.

క్రీడా నేపథ్యం ఉన్న కుటుంబంలో నవంబర్ 11, 1986లో ఆనంద్ జన్మించాడు. తండ్రి వైమానిక దళ విశ్రాంత ఉద్యోగి, మామయ్య భారత హాకీ జట్టు సభ్యుడిగా ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించాడు. తాతయ్య కూడా జాతీయ స్థాయి క్రీడాకారుడే. పెద్దన్నయ్య మంచి బాడీ బిల్డరే. వీరి ప్రభావం ఆనంద్ ఆర్నాల్డ్‌పై పడకుండా ఎలా ఉంటుంది. ముఖ్యంగా పెద్దన్నయ్య చేసే కసరత్తులు ఆనంద్‌ను పొద్దున్నే నిద్ర లేపేసేవి. తానూ కూడా దండీలు తీస్తూ జబ్బలు చరుచుకుని చూసుకునేవాడు. అదీ 13 ఏళ్ల ప్రాయంలోనే డిసైడేపోయాడు. ఎలాగన్నా అన్నయ్యలా బాడీ బిల్డర్ అయిపోవాలని. ఆయన వద్దే శిక్షణ వద్దే ప్రారంభించాడు. బాగా రాటుదేలేందుకు ఎక్కువ సమయం పట్టలేదు. ఆ వయసుకే పోటీల్లోను పాల్గొన్నాడు. తొలి ప్రయత్నంలోనే మిస్టర్ లూథియానా టైటిల్‌తో ఆనంద్ సత్తా చాటాడు. ఈ వయస్సులో అతనికి శరీరం సహకరించడం గొప్ప విషయమనే చెప్పాలి. ఆనంద్ అద్భుతమని అతడి భవిష్యత్తు చాలా పెద్ద స్థాయిలో ఉండబోతోందని చర్చలు తీవ్రమయ్యాక ఓ అనుకోని విషయం జరిగింది. 15వ ఏట అతని జీవితం తలకిందులైపోయింది.

ఉన్నపళంగా కాళ్లలో వణుకు మొదలవడంతో ఓ రోజు డాక్టరు వద్దకు అతన్ని తల్లిదండ్రులు తీసుకెళ్లారు. వారి గుండె చెరువయ్యే ఓ విషాదాన్ని వైద్యులు గుర్తించారు. ఆనంద్‌కు వెన్నెముక క్యాన్సర్ చివరి దశలో ఉన్నట్లు



వైద్యులు నిర్ధారించారు. ఆపరేషన్ చేసి ఏర్పడిన కణితులను తొలగించారు. ఈ నేపథ్యంలో ఆనంద్ మంచం పట్టి... శిశువుగా మారిపోయాడు. కాళ్ల నుంచి మెడ వరకు ఏ అవయవం పనిచేయకపోవడంతో అన్ని మంచం నుంచి సాగడంతో మూడేళ్ల పాటు ప్రత్యక్ష నరకం చూశాడు. అతని తల్లి, అక్క మమకారంతో అతన్ని చంటి బిడ్డలా సాకి ఆరోగ్యం కోలుకునేలా చేశారు.

వీల్‌చైర్ నుంచే శిక్షణ ప్రారంభించి ..

ఇంతటితో తన జీవితం అయిపోలేదని... మనోబలాన్ని పెంచుకున్న ఆనంద్ క్రమంగా కోలుకున్నాడు. పట్టుదలగా జిమ్‌కు వెళ్లి వర్కవుట్‌లు మొదలెట్టాడు. శరీరాన్ని అనువైన రీతిలో వంచాలంటే అవయవాలు అన్ని సక్రమంగా ఉంటేనే సాధ్యమవుతుంది. అతనిలో సంకల్ప బలం లక్ష్యం వైపు పదమని దారి చూపింది. తాను చేసే వర్కవుట్‌లకు అతని భుజాలు, ఇతర అవయవాలు సహకారం అందిస్తున్న విషయాన్ని గుర్తించిన ఆనంద్ వీల్‌చైర్‌పైనే వ్యాయామాన్ని చేయడం మొదలెట్టాడు. ప్రతిరోజు భుజాలు, బాహువులు, ఎదురు రొమ్ము, వీపు ఆకృతిని తీర్చిదిద్దే వ్యాయామాలు చేసేవాడు. అలా మిస్టర్ ఇండియా పోటీలకు తయారవుతానని చెప్పడంతో వ్యక్తిగత కోచ్ రవి పరాంశుర్ కోచింగ్‌ను మొదలెట్టారు. అమిత్ గిల్ అనే ఆనంద్ స్నేహితుడు రోజు జిమ్‌లో శిక్షణకు స్వయంగా వచ్చి తీసుకెళ్లేవాడు. దాతలు సహకారం అందించారు. అతనిలో పోటీ పడాలన్న కాంక్షకు బీజం పడింది. 18వ ఏట నుంచి మిస్టర్ బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రారంభించడం మొదలెట్టాడు. 2004 నుంచి 2013 వరకు మిస్టర్ పంజాబ్‌ను టైటిళ్లను, 2010 నుంచి మిస్టర్ నార్త్ ఇండియా, 2011, 2012, 2013ల్లో మిస్టర్ ఇండియా టైటిళ్లను తన ఖాతాలో జమ చేసుకున్నాడు. ఇప్పటి వరకు 41 టైటిళ్లను సాధించినట్లు తెలిపిన ఆనంద్ ప్రధాన లక్ష్యం మాత్రం భారత్‌లో అక్టోబర్‌లో జరిగే తొలి ప్రపంచ కప్ టోర్నీ. 125 దేశాల నుంచి బాడీబిల్డర్లు పాల్గొంటున్నారు. ఇది సొంత దేశం నుంచి ప్రారంభం కావడంతో 29 ఏళ్ల ఆనంద్ మిస్టర్ వరల్డ్‌ను సాధిస్తానన్న ధీమాను వ్యక్తం చేస్తున్నాడు. దేశానికి టైటిల్ అందించాలని తపన పడుతున్నాడు. తన జీవితాన్ని సినిమా తీస్తే నటించాలని ఉందని మనసులో కోరికను బయటపెట్టాడు. యూఎస్‌కు చెందిన అలెన్ ఉడ్‌మన్ రైటర్ ఆనంద్ జీవిత కథను 'వెయిట్‌లెస్: ఏ ట్రూ స్టోరీ ఆఫ్ కరేజ్ అండ్ ఇన్సిపిరేషన్' పుస్తకం రాసి ఆ దేశంలో ప్రచురించాడు. సాధించాలన్న పట్టుదల, నమ్మకం ఉంటే బలహీనతను అధిగమించవచ్చునని అతని జీవితాన్ని చదివినవారు ఇండియా ఆర్నాల్డ్ అని ఆ దేశంలో అంటే అంతకుమించే కథ ఉందన్నవారూ ఉన్నారు.

- ఈశ్వర్ నెట్టెం

ఇండెక్స్

సేవ 3

పర్యాటకమే వలసల్ని ఆపింది

వివరం........4

అంతరిక్షాన్ని చూడండి

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10

తొక్కేం కాదు..

సందర్భం..............11

అమెరికా వింటోంది

కవిత్వమ్...............14

కందిన రేకులు

మనం సంతోషానికి దూరం

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12

పంచరత్నాల హారం 'మాలపిల్ల'

తెలుసా....................15

పుస్తకంలో చిన్నారి ప్రపంచం..!

కథ 16

డబ్బు కావాలి

కొత్త పుస్తకాలు................20

వ్యక్తిత్వనిర్మాణం జీవన శిల్పం

రుచి.......................21

మిర్చీ ముర్గ్

బాల నేస్తాలు............23

హిమాలయన్ మోనాల్

పద వికాసం........24

గుణపాఠం

19-3-2017 నాటి అట్టమీది కథ మహానటి సావిత్రి గురించి చదివి ఆనందించాం. ఆమెనటన, హావభావాలు, రసపోషణ ఏనటికీరావు. ఆ నవ్వు సావిత్రి ప్రత్యేకత. గొప్పనటిగా నీరాజనాలందుకొన్న సావిత్రి అవసానదశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించటం బాధాకరమైన విషయం. ఆమె సంపాదించిన కోట్లాది రూపాయల ఆస్తి హారతి కర్పూరంలా హరించుకు పోవడం ఆశ్చర్యం వేసింది. ముందు వెనుకలు చూసుకోకుండా అపాత్ర దానాలు చేసిన సావిత్రి జీవితం అందరికీ గుణపాఠం. రష్యన్ పుస్తకాలు చదవటం మొదలు పెట్టిన ఇటలీకి చెందిన రికార్డో ఏకంగా వంద భాషల్ని నేర్చుకోవడం అబ్బురపరిచింది. ఇన్ని భాషలు నేర్చుకొని ఆ యా దేశాల సంస్కృతులపై పట్టుసాధించిన రికార్డో నిజంగా అభినందనీయుడు. క్లిష్టమైన భాషలను కూడా ఆయన నేర్చుకోవటం బట్టి భాష పట్ల ఆయనకున్న ఆరాధనాభావం ఏమిటో తెలిసింది.

-మంకు శ్రీను, కొవ్వూరు

వెలుగుచుక్కలు

ఆడపిల్లలని కిడ్నాప్‌చేయడం, చిన్నపిల్లలని తినుబండారాల ఆశచూపి సుదూర ప్రాంతాలకి తరలించడం, ఆడపిల్లల అక్రమరవాణ, వెట్టిచాకిరి వంటివి ఇప్పటికీ రాజస్థాన్‌లో చోటుచేసుకోవడం బాధాకరం. అలాంటి తీవ్ర పరిస్థితుల్లో బెదిరింపులకి తలొగ్గకుండా ఆడపిల్లల రక్షణకోసం కృషిచేసిన రష్మీతివారి నేటి తరానికి మార్గదర్శి. ఆ పాత కొత్త స్టైల్స్ ఆకట్టుకున్నాయి. ఒకటి రెండు భాషలు నేర్చుకోడమే కష్టమనిపిస్తుంది. అలాంటిది రాజుల నాటి కాలానికి చెందిన దాదాపు వంద భాషల్ని అవపోసన పట్టడం ఆశ్చర్యపరిచింది..

మహానటి సావిత్రిపై వచ్చిన అట్టమీది కథ ఆద్యంతం చదివించింది. ముక్కుతో ఊదేస్తాడు, నాలుతో కోట్ల సంపాదన ఆశ్చర్యపరిచాయి. అవయవలోపాన్ని కూడా లెక్కచేయకుండా పారాలింపిక్స్‌లో ఆరితేరిన అభిషేక్‌కి హ్యాట్స్ ఆఫ్. ప్రకృతి పాత్ర, ఊహాతీత చిత్రాల నుంచి కళ్లుతిప్పుకోలేక పోయాం.

- శారద, కర్నూలు

ఈల భాష

సైగలతో భావలని పంచుకోవచ్చు కానీ గ్రీకు వాసులు ఈల భాష ద్వారా మాట్లాడుకోవడం ఆశ్చరపరిచింది. అట్టమీది కథ మహానటి సావిత్రి ద్వారా మా అభిమానటి గురించి ఎన్నో తెలీని విషాయాలు తెలిసాయి. రాజస్థాన్‌లో ఆడపిల్లలపై అన్యాయాలకి ప్రతిఘటిస్తున్న తివారికి హ్యాట్స్ ఆఫ్. మాటల మహారాజు, ఐరన్ మారథాన్, పంటి విలుకాడు, గురువు కథ చదివించాయి. చివరి అట్టమీద వచ్చిన ప్రకృతి పాత్ర చిత్రాలు బాగున్నాయి. నవ్వుల్ పువ్వుల్ నవ్వు తెప్పించాయి.

- లక్ష్మణ్, విజయవాడ

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

సేవ

పర్యాటకమే వలసల్ని ఆపింది

గ్రామీణ ప్రాంతాల్లో వలసల కథలు అడుగడుగునా పలకరిస్తూనే ఉంటాయి. పని అవకాశాలు లేక పేదరికాన్ని భరించలేక ఇప్పటికే ఈ ప్రాంతంలో 70 శాతం గ్రామీణ ప్రజలు పట్టణాలకి వలసవెళ్లినట్టు కొన్ని నివేదికలున్నాయి. ఇలాంటి పరిస్థితులు ఒడిశాలోని కారాకుట్ వ్యాలీని నిర్జీవంగా మారుస్తున్నాయి. మాలి తెగల వలసని ఆపేందుకు కొత్త ఆలోచనతో ముందుకొచ్చాడు యుగబ్రత కర్. ఎకో టూరిజం ద్వారా తను చేస్తున్న కృషేంటో మీరే తెలుసుకోండి.

యుగబ్రత పుట్టి పెరిగింది ఒడిశాలోని పూరీలో. పర్యటనలు చేయడమంటే తనకి ఎంతో ఇష్టం. మెకానికల్ ఇంజినీర్ అయినా అభిరుచికి తగ్గట్టు పర్యాటకం, ఆతిథ్య రంగానికి చెందిన విద్య నేర్చుకున్నాడు. యాత్రా నిర్వాహకుడిగా ఉద్యోగం లభించింది. కొన్ని రోజులు ఆ ఉద్యోగం చేశాక ఓ ప్రముఖ కంపెనీలో సేల్స్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరాడు. వ్యవసాయంలో ఉపయోగించే నీటి పంపుల అమ్మకాల కోసం కోరాపట్ లోయలో లామ్టాపుట్ ప్రాంతానికి వెళ్లేవాడు. అప్పుడే పల్లెల్లో వలసల గురించి తెలిసిందతనికి. సాంకేతిక అభివృద్ధి లేక ఇంకా ఆ గ్రామాలు పాత పద్ధతుల్లోనే వ్యవసాయం కొనసాగిస్తున్నాయి. సరైన దిగుబడి లేక పేదరికాన్ని అనుభవించేవారు. ఆ గ్రామాల్లో వ్యవసాయం తప్ప ఇంకేవిధమైన ఉపాధి అవకాశాలు లేకపోవడంతో అందరూ పని కోసం పట్టణాలకి వెళుతున్నారనే విషయాలు తెలిశాయి. లామ్టాపుట్ వాసుల వలసలు తనని కదిలించాయి. అప్పుడే తనకి ఎకో టూరిజం ఆలోచన తట్టింది. పర్యాటక ప్రదేశంగా అభివృద్ధి చేయడంతోపాటు స్థానిక సంప్రదాయ వృత్తులని పునరుద్ధరించడం ద్వారా స్థానిక తెగలకి ఉపాధి అవకాశాలు అందజేయడమే ఎకో-టూరిజం ముఖ్య ఉద్దేశం. ఆ దిశగా తను చేసిన ఆలోచనే 'దేసియా' పేరుతో కార్యరూపం దాల్చింది. బ్యాంకు లోన్‌తో పనులు మొదలయ్యాయి. స్థానికులని సైతం ఈ అభివద్ధి పనుల్లో భాగస్వామ్యం చేశాడు. ఓ మారుమూల ప్రాంతాన్ని అభివృద్ధి చెయ్యడం కంటే స్థానికుల నమ్మకాన్ని పొందడం తనకి పెద్ద సవాలుగా మారింది. స్థానికుల్లో పర్యాటక ఆదాయంపై అవగాహన పెంచడంతోపాటు వలసలని తగ్గించేందుకు ఎప్పటి కప్పుడు చర్చలని నిర్వహించేవాడు. వీటితో పాటు స్థానిక తెగల యువతకి శిక్షణ ఇవ్వడం ప్రారంభించాడు. చిన్నారులకి వికాసవంతమైన విద్యనందించేందుకు ప్రీ-స్కూల్స్‌ని ప్రారంభించాడు. హస్తకళలు, సాంప్రదాయ ఆభరణాల తయారీ, అమ్మకాల దిశగా మహిళలకి శిక్షణనిచ్చాడు. అతి తక్కువ సమయంలోనే అధునాతన సదుపాయాలు, స్థానిక హస్తకళలతో అలంకరించబడిన విశాలమైన అతిథి గృహాలు, వస్తు ప్రదర్శనశాలలతో నాలుగెకరాల్లో చక్కటి ప్రకృతి శోభతో కారాపుట్ లోయ మంచి పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దుకుంది.

విదేశీయులు ఫిదా

ఇక్కడికొచ్చే యాత్రికులు అక్కడి ప్రకృతి అందాలని తిలకించడం ట్రెకింగ్, హైకింగ్ లాంటి సాహసయాత్రలు చేయడంతోపాటు స్థానిక కళలని నేర్చుకోడానికి ఇష్టపడుతుంటారు. అక్కడి తెగల్లో పేరొందిన మాండియా జావు, బౌన్సా కాడి సబ్జీ వంటకాలని యాత్రికులకి రుచి చూపిస్తారు. ఆకుల్లో వడ్డించే సాంప్రదాయంతోపాటు ఈ వంటకాల రుచికి విదేశీయులు ఫిదా అయిపోయారు. మాలి తెగల వాద్య పరికరాలని ఉపయోగించడం, వంటకాలను నేర్చుకోవడంతోపాటు వ్యవసాయ పనుల్లోనూ విదేశీ పర్యాటకులు సాయపడుతుంటారు. టూరిజంపై వచ్చే ఆదాయాన్ని మొత్తం మాలి తెగ అభివృద్ధి పనులకే వినియోగించాడు యుగబ్రత. విదేశీ యాత్రికులని సైతం కట్టిపడేస్తున్న ఈ ప్రాంతంలో ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా ఉపాధి

అవకాశాలని కల్పించగలిగాడు. అటు వ్యవసాయంతోపాటు టూరిస్ట్ గైడ్‌లుగా ఉపాధి లభించడం స్వయం ఉపాధి మార్గాల ద్వారా మహిళల ఆర్థిక వనరులు పెరగడంతో వలసలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. యుగబ్రత చేపట్టిన 'దేసియా' ఎకోటూరిజం ప్రాజెక్ట్ మంచి ఫలితాలని సాధించడంతో టూరిజం శాఖ మనదేశంలోని దాదాపు 60 ఎకోటూరిజం ప్రదేశాల్లో స్థానిక తెగలకి ఉపాధి పనులని అములుపరిచేందకు ముందుకొచ్చింది. సేంద్రీయ వ్యవసాయం, ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, ఆర్ట్ గ్యాలరీల ఏర్పాటు లక్ష్యంగా తన మలివిడత అభివృద్ధి పనులు మొదలయ్యాయి.

– శర్వాణి



అంతరిక్షాన్ని చూడండి

ప్రకృతి అందమైనది... .ఆహ్లాదకరమైనది..... ఎన్నో అద్భుతాలను తనలో దాచుకుని మానవుని మనుగడకు భరోసానిస్తోంది. అంతరిక్షం....మరీ అద్భుతమైనది మన కంటికి కనిపించే వాటినే కాదు కనిపించని ఎన్నో అబ్బురపరిచే అంతుపట్టని వింతలు విశేషాలకు కేంద్రంగా నిలిచి మానవుని మేధస్సుకు పదును పెడుతోంది. అందుకే సైన్స్ ఫిక్షన్ రచయిత కార్ల్ సాగన్ అంటాడు "ఎక్కడో ఒక చోట, ఏదో ఒక నమ్మలేని నిజం తెలుసుకునేందుకు ఎదురుచూస్తుంటుంది" అని. వాటిని శోధించాలి... మరింతగా పరిశోధించాలి. వాటిలోని విశేషాలు తెలుసుకోవాలి.

ఖగోళ శాస్త్రం అలాంటి అద్భుతమైన వాటిని తెలుసుకునే అవకాశాన్ని మనకు కల్పిస్తోంది. ఒక సంక్లిష్టమైన, ఆకర్షణీయమైన, అందరిలోనూ అదేంటో తెలుసుకోవాలన్న ఆత్రుతను కలిగించే అద్భుతశాస్త్రం.. ఖగోళశాస్త్రం. పిల్లలైతే మరింత ఆసక్తి పెంచుకుంటారు. అదీ గ్రామీణ ప్రాంతానికి చెందిన వారైతే ఆ ఆసక్తి రెట్టింపుగా వుంటుంది. ఖగోళ శాస్త్రంపై గ్రామీణ ప్రాంతాల పిల్లలకు తెలియని ఎన్నో వింతలు, విశేషాలను డాక్యుమెంటరీ రూపంలో వారికి చేరువ చేసేందుకు రెండేళ్లకు పైగా అవిశ్రాంత కృషి చేస్తున్నారు రాకేష్ -సోమన్ జంట. వీరికి సైన్స్ అంటే ఎంతో ఆసక్తి. దానిని పది మందికి తెలియజేయాలంటే ఎక్కడ లేని ఉత్సాహం. గ్రామీణ పిల్లలకు దానిని చేరువ చేసేందుకు నిద్రాహారాలు కూడా లేకుండా భారత్‌లో అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన అంశాలపై పలు డాక్యుమెంటరీలు రూపొందించారు. వాటి కోసం 'ఎన్‌సిస్టిక్ ప్రొడక్షన్స్' అనే సంస్థను కూడా స్థాపించారు కాలేజీలో చదువుకునే నాటి నుంచే వీటిపై ఆసక్తి పెంచుకున్నారిద్దరూ. డాక్యుమెంటరీలు రూపొందించడానికి నాసా, ఈసా, ఇస్రో తదితర అంతరిక్ష పరిశోధనా సంస్థలకు చెందిన వెబ్‌సైట్లను పరిశీలించి సమాచారాన్ని సేకరిస్తారు. ఆ సమాచారాన్ని క్రోఢీకరించి యువతకు పిల్లలకు అర్థమయ్యే రీతిలో డాక్యుమెంటరీలు రూపొందిస్తారు.

గోవాలో పుట్టిన రాకేష్ అధునాతన ఆవిష్కరణల్లో సైన్సును ప్రోత్సహించాలని బలంగా నమ్ముతారు. ఫిల్మ్ మేకర్. భౌతిక శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన రాకేష్ నేషనల్ సెంటర్ ఫర్ అంటార్కిటిక్ అండ్ ఓషన్ రీసెర్చ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, గోవా సొల్యూషన్ కంట్రోల్ బోర్డు, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ తదితర సంస్థలతో కలిపి పలు డాక్యుమెంటరీలు రూపొందించారు. ఇటీవలే దాదాపు 16 నెలలు అంటార్కిటికాలో గడిపి భారత్ నిర్మిస్తున్న 3వ అంతరిక్ష కేంద్రం 'భారతి' పై డాక్యుమెంటరీ తీశాడు. డాక్యుమెంటరీలు రూపొందించడమే కాకుండా 'ఫ్రెండ్స్ ఆఫ్ ఆస్ట్రానమి' అనే గోవాకు చెందిన స్వచ్ఛంద సంస్థలో పదిహేనేళ్లుగా పని చేస్తున్నారు.



సోనమ్ పంజాబ్ యూనివర్సిటీ అప్లైడ్ ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేశారు. బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిస్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్(ఐఐఎ)లో రెండేళ్లు రీసెర్చ్ ట్రైనీగా చేశారు. అంతరిక్ష వాతావరణ శాస్త్రంలో ప్రస్తుతం ఎంటెక్ చేస్తున్నారు. సెంటర్ ఫర్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ ఇన్ ఆసియా, అండ్ ది పసిఫిక్ అహ్మదాబాద్‌లోని ఫిజికల్ రీసెర్చ్ లేబరేటరీ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ జంట ఖగోళ రంగంలో కృషి చేస్తున్న సంస్థల కృషిని తెలుసుకుంటారు. వాటినే డాక్యుమెంటరీలుగా రూపొందిస్తారు. ప్రపంచంలోని ఖగోళ పరిశోధనా సంస్థలన్నిటినీ పర్యవేక్షించే ఇంటర్నేషనల్ అస్ట్రనామికల్ యూనియన్' పరిధిలో పనిచేస్తున్న ఆఫీస్ ఆఫ్ ఆస్ట్రానమికల్ డెవలప్ మెంట్(ఎవిడి)కి2014లో ఒక ప్రతిపాదన పంపారు. ఆ ఏడాది చివరికి అందిన 230 ప్రతిపాదనల్లో ఏడింటిని మాత్రమే ఏవిడి అనుమతించింది. వాటిలో రాకేష్, సోనమ్ రావ్ ప్రతిపాదనలు ఉండటం విశేషం. అనుమతి రావడంతో వెంటనే కార్యరంగంలోకి దిగారు. మొట్ట మొదటగా వారు సందర్శించింది కొడైకెనాల్‌లోని అబ్జర్వేటరీ. దీని అద్భుతమైన చారిత్రక ప్రాధాన్యత గురించి భారతీయులకు తెలిసింది చాలా తక్కువంటారు రాజేష్ జంట.

ఒక అబ్జర్వేటరీ సందర్శనకు వెళ్ళినప్పుడు చుట్టూవున్న అడవిని సందర్శించారు. ఇక్కడ ఒక ప్రత్యేకమైన టెలిస్కోప్ వుంది. ఇది ఆసియాలోనే అతి పెద్ద టెలిస్కోప్. దీని నుంచి చూస్తే 40కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక చిన్న నాణెం కూడా స్పష్టంగా కనిపిస్తుంది. రాత్రి సమయంలో ఆ ప్రాంతంలో టెలిస్కోప్ నుంచి ఖగోళంలోకి చూస్తున్న వారి పాదాలపైకి ఏవో పాకుతున్నట్లు అనిపించింది. కిందికి చూస్తే తేళ్లు కాళ్ళపైకి ఎగబాకుతున్నాయి. ఒక పాము కూడా పాదాల చుట్టూ తిరుగుతూ కనిపించింది వీరికి. దేశ వ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో రాజేష్, సోనమ్‌లు కలిసి మాట్లాడారు. ఖగోళ శాస్త్రం గురించి వారేమనుకుంటున్నారో వారికున్న సందేహాలేమిటో అడిగి తెలుసుకున్నారు. ఖగోళశాస్త్రానికి సంబంధించిన ప్రాథమిక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రయోగాలపై అవగాహన కల్పించడమే అవసరమని తెలిసింది. ఆ దిశగా అడుగేస్తూ విద్యార్థులను చైతన్య పరుస్తున్నారు.

- కె.ఎస్.ఎం

నవ్వుల్ - పువ్వుల్

ఎక్కడ పుట్టింది



స్వేత : మగాళ్లందరూ ఒకే లా ఉంటారు అనే సామెత ఎలా పుట్టిందో తెలుసా??
గీత :ఎలా పుట్టిందో తెలీదు కానీ కచ్చితంగా అది చైనాలోనే పుట్టుంటుంది. ఎందుకంటే అక్కడ అందరూ చూడ్డానికి ఒకేలా వుంటారు కదా!

గాలి కబుర్లు

తండ్రి: మీ కొత్త టీచర్ పాఠాలు ఎలా చెబుతున్నారు?
కొడుకు : అన్నీ గాలి కబుర్లే నాన్నా!
తండ్రి : అదేంట్రా అట్లా అంటావు?
కొడుకు : నిన్న ఆక్సిజన్, మొన్న నైట్రోజన్. ఇవాళ్ల హైడ్రోజన్ పాఠాం.... మరి ఇంకేం అనాలి!!

ఒక ముసలావిడ వైజాగ్ వెళ్లే బస్సెక్కి కండక్టర్‌తో ఇలా అంది....
బాబూ విజయవాడ రాగానే చెప్పు....... మర్చిపోవద్దు
కండక్టర్: సరే ఇంకా చాలా దూరం వుంది మీరు హాయిగా పడుకోండి....
కొన్ని గంటల తర్వాత ముసలావిడ లేచి...
కండక్టర్‌తో......బాబూ విజయవాడ వచ్చిందా??
కండక్టర్: సారీ బామ్మగారూ విజయవాడ దాటి 10 నిమిషాలయ్యింది.
ముసలావిడ : అయ్యో...
జాలితో డ్రైవర్ మళ్లీ బస్సు రివర్స్ చేశాడు....
కండక్టర్: దిగండి ఇదే విజయవాడ స్టాప్
ముసలావిడ : మా అబ్బాయి విజయవాడ రాగానే ట్యాబ్లెట్ వేసుకోమన్నాడు బాబూ ...... నాపని పూర్తియిపోయింది.... ఇప్పుడు స్టార్ట్ చేయండి బస్సు నేనూ వైజాగ్‌లోనేదిగాలి.

కిసుక్కు

గీత : నువ్వంటే నాకు చాలా ఇష్టం అందుకే నీతో అన్నీ షేర్ చేసుకోవాలనుకుంటున్నాను.
శ్రీను : ఐతే మొదట నీ బ్యాంక్ డీటెయిల్స్ నుంచి స్టార్ట్ చేద్దాం...

అభివృద్ధి



చింటు : భారత్ అభివృద్ధి చెందుతున్న దేశం అనటానికి ఒక ఉదా హరణ చెప్పు?
బంటి : ఇదివరకు 'సెల్ఫ్ రస్పెక్ట్ (విలువ)వుండేది.... ఇప్పుడు 'సెల్ఫీకి విలువ పెరిగింది.

నాన్న....అమ్మ

మహేష్ : ఏంట్రా సురేష్ ...పొద్దున్నే నానమ్మ ఇంటికి సాయంత్రం అమ్మమ్మ ఇంటికి వెళుతున్నావ్ మీ అమ్మా నాన్నపై అలిగావా??
సురేష్ : నేను కాదు మా అమ్మా నాన్నే అలిగారు.....అమ్మేమో అలిగి వాళ్ల పుట్టింటికి వెళ్లింది. నాన్నేమో వాళ్ల నాన్నింటికి వెళ్లాడు. అందుకే నేను ఇద్దరిళ్లకీ తిరగలేక ఛస్తున్నా...!!

కిసుక్కు సిత్రం

నా బొమ్మే గీస్తావా..!

నాకు నచ్చిన చిత్రం **ఇల్లస్ట్రేటర్ : పావెల్ వుయుజ్నిి**
సేకర్త - పి. బాలు, గుణదల

మనం సంతోషానికి దూరం

- అజయ్ కుమార్ వారాల

9502395077

ఫిలాసఫీలు వద్దు గురూ ఫ్యాక్టులు మాట్లాడుకుందాం.. మన దేశం ఏమంత ఆనందంగా లేదు. సంతోషానికి ఆమడ దూరంలో ఉంది. ఎంత దూరమంటే 158 దేశాల్లో 122వ స్థానమంత. మన కన్నా పేద దేశాలు, మన కన్నా చిన్న దేశాలు, మన కన్నా పెద్ద దేశాలు, మన కన్నా కొత్త దేశాలు ఆనందంగా ఉన్నాయి. మరీ ముఖ్యంగా టెర్రరిజంతో సతమతమవుతోన్న పాక్, యుద్ధం నుంచి ఇంకా కోలుకోని ఇరాక్, అత్యధిక జనాభా ఉన్న చైనా, మనం పదే పదే సాయపడుతోన్న పేద దేశమైన నేపాల్, జాతి వైరాలతో మండిపోతోన్న మయన్మార్, సాదాసీదాగా బతికేసే భూటాన్, మనం పక్షం వహించిన బంగ్లాదేశ్ ఇలా పొరుగు, దాపున ఉన్న దేశాలన్ని కాస్తోకూస్తో మనకంతా సంతోషంగానే ఉన్నాయి. ఇది వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్. మనం ఎందుకు సంతోషానికి దూరంగా ఉన్నామనేదే ఈ వారం అట్టమీది కథ.

భారత్‌కు ఏవో రోజులు వచ్చాయి. కొందరు మంచి రోజులంటున్నారు. కొందరు కొత్త శకమంటున్నారు.. స్వర్ణ యుగమంటున్నారు. కావాలంటే చూడండి మన జీడీపీ చైనాతో పోటీ పడుతోందంటారు. అమెరికాను దాటేసి సూపర్ పవర్ అయిపోతామంటారు. ఈ మధ్య ఓ ప్రకటనొచ్చింది ఏకంగా 30 మంది బిలీనియర్‌లు భారత్ వారే అని గొప్పలు పోతున్నారు. నోట్ల రద్దు ప్రజలకు కష్టం కానే కాదని, చాలా ఇష్టంగా దేశమంతా ఏటీఎంల క్యూలైన్లలో నించుందని... కావాలంటే యూపీలో ఇచ్చిన తీర్పు చూడండహో అంటూ బీరాలు పోతున్నారు. మరీ లోకల్‌కి వచ్చేస్తే ఆంధ్ర రాజధాని విశ్వ నగరంలా కనువిందు చేస్తుందని... మధ్య మధ్యలో ఉత్సవాలు చేసేస్తూ సంతోషంగా ఉండండని, సుఖంగా సాగిపోతోందని ఊదరగొట్టేస్తున్నారు. సంతోషమంటే విశ్వ నగరమని, ఆనందమంటే శత కోటీశ్వరుల అంకెలని, జీడీపీ లెక్కలని నవ్వులు చిందించేస్తున్నారు. సంతోషాన్ని ఇలా ఎలా కొలుస్తాం. కొందరి వృద్ధి, కొన్ని కలలతోనే అంతా బ్రహ్మాండమనుకుంటే, అందరూ తెగ సంతోష పడిపోతున్నారనుకుంటే ఇండెక్స్ ముల్లు విరిగినట్టే. సంతోషాన్ని ఎలా కొలవాలో... అసలు దాన్నే ఓ దేశం వృద్ధికి, ఆరోగ్యానికి సూచీగా ఎలా తీసుకోవాలో భూటాన్ చెప్పి చాలా రోజులయ్యింది. పాటించీ సంవత్సరాలవుతోంది. దేశంలో ఈ మాట ఇంకా వినబడటం లేదు. విననీరు కూడా. కానీ ఓ నివేదిక మాత్రం చర్చ మొదలయ్యేలా చేస్తోంది. ప్రతి ఏటా ఎంతో కొంత బుర్రనూపి వెళుతోంది. అదే 'వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్'. ఐక్యరాజ్య సమితి సహకారంతో వెలువడుతున్న ఈ నివేదిక 158 దేశాల సంతోషాల్ని లెక్కకడుతోంది. అందులో మన భారత్‌ను చేర్చి మన కళ్లు తెరిపించడం ఓ భాగ్యమనే అనుకోవాలి. లేకుంటే ఈ సంతోషం లెక్కేంటో అస్సలు తెలీకుండా ప్రధాన స్రవంతిలో పడి కొట్టుకుపోతుండే వాళ్లం.

ఎలా కొలవాలి

సంతోషాన్ని కొలవడమా! అది ప్రతి వ్యక్తికి, ప్రతి వర్గానికి, సమాజానికి మారిపోతుంటుంది కదా. ఓ సాధువునే చూసుకుంటే ఆయనకు ధనార్జనతో పనిలేదు. ఓ లాభసాటి వ్యాపారినే తీసుకుంటే ఆయనకు డబ్బే అన్ని కొనేస్తుంది కదా. అన్న డౌట్ మీకే కాదు నివేదిక రూపొందించే వారికీ వచ్చింది. అందుకే ప్రతి ఒక్క విషయాన్ని మరింత పట్టించుకుంది. స్వేచ్ఛ, నిజాయితీ, ఆరోగ్యం, ఆదాయం, శ్రద్ధ, మంచి ప్రభుత్వం, మానవ విలువలు, సామాజిక తోడ్పాటు, లైఫ్ చాయిస్ తీసుకునే అవకాశం, అవినీతి, నిజ స్థూల జాతీయోత్పత్తి, సహాయం పొందే అవకాశం, భరోసా వంటి అనేక అంశాల్ని పరిగణనలోకి తీసుకుని సంతోషానికి పూర్తి ఫ్రేమ్ ఇచ్చేసింది. దాన్ని దేశానికి అన్వయించింది. ఈ అంశాల్లో 0–10 స్కోరింగ్ ఇచ్చి దేశాల స్టాటిస్టిక్స్‌తో పోల్చి



నిరుద్యోగం... అతి శ్రమ

భారత్ సంతోషం పోగొట్టే విషయాల్లో ముందుంటోంది నిరుద్యోగం. ప్రస్తుత యువ భారత్ చీకూ చింతకు ఇదే పెద్ద కారణం. మన వీధిలోనే నలుగురు ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఖాళీగా తిరుగుతోంటే మరో పది మంది యువత ఏదో ఒక ఉద్యోగం చేయాలని తీవ్ర కష్టాలే పడుతోంది. వీరికిది నోట్లో టూత్‌బ్రష్ పెట్టుకున్నప్పటి నుంచి దిండు మీద తల ఆనించే వరకూ బర్నింగ్ ఇష్యూనే. కలల్లోను పాడైపోతున్న జీవితం గురించి కలల కామనే కావడంతో కలత నిద్రలో రెజ్యూమ్‌లు, ఇంటర్వ్యూల కలవరింతలతోనే గడిచిపోతుందనడంలో సందేహం లేదు. కుంగుబాటు లాంటి మానసిక సమస్యలకు ఇది మూల కారణం. పని దొరకడం, ఉద్యోగం రావడమే పెద్ద సమస్య అయితే ఇక నాణ్యమైన ఉద్యోగం, వృత్తి, పనివేళల మాటెక్కడ. ఒక్కరే ఇద్దరు ముగ్గురి భారాన్ని అదనపు పని వేళల్ని మోసేస్తున్నారని కొన్ని నివేదికలు. ఓ నివేదిక ప్రకారం అలసట అనేది భారతీయుల ఆరోగ్యంతో చెలగాటమాడుతోన్న ఓ ప్రధాన సమస్య. 18-64 ఏళ్ల మధ్య నుండే ఐదుగురిలో ఒకరు విపరీత శ్రమను, ఒత్తిడిని ఎదుర్కుంటున్నారు. మిగతావారూ అదనపు భారం బాధితులే. ఈ అలసటకు కాలుష్యం తోడై హృద్రోగ ఇతర దీర్ఘకాలిక వ్యాధుల బారినపడుతున్నారు. 'మోస్ట్ ఓవర్-వర్క్‌డ్ అండ్ టైర్డ్' మనుషులం మనం. ఏడాదికి 2000 గంటల పనివేళలు ఖర్చయిపోతున్నాయి. వెకేషన్ లేక పాడిబారిపోతున్న బతుకుల్లోను ప్రపంచంలో

నాలుగో స్థానంలో ఉన్నాం. ఆఫీసుల్లో జీవితాల్ని వెల్లదీస్తున్న మిల్లెనియల్స్‌లో భారతీయ యువత ఎక్కువ. వారానికి 52 గంటల శ్రమకే జీవితమైపోతోంది. శ్రమజీవులు, పని రాక్షసులుగా బాగా పేరుబడిన జపనీయులే వారానికి 46 గంటలతో కాస్త కులాసాగా ఉంటున్నారట. ఆస్ట్రేలియా, యూకే లాంటి దేశాల్లో నిర్దిష్ట పనివేళల్ని పక్కాగా పాటిస్తున్నారు. వారు వారానికి 41 గంటలే పనిలో ఉంటారు. ఇలా పని చోటే బతికేస్తూ కుటుంబ జీవితానికి చాలా దూరం వెళ్లడం... వ్యక్తిగత, వైవాహిక, కుటుంబ సంబంధాలు, బాంధవ్యాల్లో అంతరాలు పెరగడానికి దారితీసి తీవ్ర మానసిక సమస్యల్లో కూరుకుపోయేలా మారుతోందట పరిస్థితి. దీర్ఘకాలం ఇదే పనితీరు కొనసాగితే చాలా ప్రమాదం అటు శారీరక ఆరోగ్యానికి ఇటు మానసిక ఆరోగ్యానికి. సంతోషం ఛాయల్లోకి చేరలేం. సంతోషం సగం బలం అంటారు. మిగతా సగం బలం మన దగ్గర లేనప్పుడు ఆ సగం దొరకదు. అలా పూర్తిగా బలహీనమైపోతాం. సంతోషంలో టాప్‌లో ఉన్న స్వీడెన్ తమ పౌరుల పనివేళల్ని రోజుకు ఆరు గంటలకు కుదించింది. ఈ ప్రయోగం మంచి ఫలితాల్నే ఇస్తోంది. పనిలో నాణ్యత పెరగడమే కాక ఉద్యోగులు ఆరోగ్యంగా కనిపిస్తున్నారట. కుటుంబంతో ఎక్కువ సమయం గడపడం ఇక్కడ కీలక విషయం. అలాగే వారాంతపు సెలవులు కూడా ఎక్కువ ప్రభావాన్నే చూపిస్తున్నాయని పలు అధ్యయనాలు. మొత్తం రీచార్జి అయ్యి తిరిగి ఉత్సాహంతో ఉద్యోగ విధుల్ని చేయడంతో ప్రొడక్టివిటీనే కాక క్రియేటివిటీ స్థాయిల్లోను మంచి మార్పే ఉంటోంది. కొన్ని దేశాల్లో వారంలో రెండు రోజులు సెలవులు తప్పనిసరి. ఇలా నిరుద్యోగంతో పాటు ఉద్యోగంలోను పని ఒత్తిడి, భారం కూడా సంతోషానికి ప్రధాన కారణాలే. చాలీచాలని జీతాలు అదనం. శ్రమ దోపిడీ, లేట్ సాలరీలు, జీతాల్లో కోతలు ఇలా చెప్పుకుంటే పోతే సామాన్యుడు మథనపడటానికి దండిగా ఉండే సమస్యలు. హార్వర్డ్ బిజినెస్ రివ్యూల్లోను ఓ విషయం చాలా గట్టిగా చెప్పుకొచ్చారు. ఎక్కడైతే ఉద్యోగులు రోజులో ఎక్కువ సమయం పనిచేస్తూ వారి వారాంతాల్ని, ఆఫ్ అవర్స్‌ను, వెకేషన్లను, అదనపు షిఫ్ట్‌లను త్యాగం చేస్తారో అది కచ్చితంగా ప్రతికూల ప్రభావాన్ని సంస్థ ప్రొడక్టివిటీ, ప్రొడక్ట్ నాణ్యతలో ప్రతిఫలిస్తుందని. బెటర్ ఔట్‌పుట్ మాట పక్కనబెడితే చేసే పనే తగ్గిపోతుందట.

15 ఏళ్లు దాటిన పౌరులతో మాట్లాడి ఓ స్పష్టమైన రూపమిస్తోంది. అందుకే చాలా దేశాలు దాన్ని తమ విధానాల రూపకల్పనకు ప్రాతిపదిక చేసుకుంటున్నారు. సంతులిత వృద్ధి, మానవ వికాసాలకు కొత్త మార్గాలు వేసుకుంటున్నారు. ఆ విషయం అర్థమవుతోంది మారిపోతున్న ర్యాంకింగ్స్ చూస్తుంటే. ముఖ్యంగా నోర్డిక్ దేశాలైన నార్వే, ఫిన్‌ల్యాండ్, స్వీడెన్, డెన్మార్క్, నెదర్‌ల్యాండ్స్ పోటీపడుతున్నాయి. కొన్ని విషయాల్లో కెనడా, న్యూజిల్యాండ్, ఆస్ట్రేలియాలు కూడా టాప్‌గా నిలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఓ దేశం ఓ ఏడాది ముందుంటే మరో దేశం మరో ఏడాది ఏకంగా మూడు నాలుగు పక్క దేశాల్ని దాటేస్తున్నాయి. వీటి మధ్య స్కోరింగ్ తేడాలు అత్యల్పం, ఇవి సంతోషపడటంలో విభేదాలు అతి స్వల్పం. కానీ మన ప్రభువులే పట్టించుకోనట్టున్నారు. పోయిన ఏడాదికంటే ఈ ఏడాది ర్యాంకింగ్‌లో మరింత దిగజారిపోయింది భారత్ సంతోషం. చెబితే బాధ పెరుగుతుంది కానీ అది మన తోటి దేశాలైనా పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్, నేపాల్ కన్నా దయనీయమైన ర్యాంకింగ్. జనాభా సమస్యలూ అని వాదించేవారికి చైనా దగ్గరగాను లేదు. ఆ దేశం సంతోషమూ పడిపోతున్నా ఉండటానికి మనకన్నా కొన్ని మెట్లు పైన సంతోషంగానే ఉంది. ఇది కచ్చితంగా విచారించదగ్గ సంగతే. అంటే అటు బాధపడటం, ఇటు ఆలోచన చేసుకోవడం రెండూనూ. మరి లేకుంటే నిత్యం బాంబు దాడులు, టెర్రరిస్ట్ స్థావరాలు, స్త్రీ హక్కులు, మానవ హక్కుల ప్రశ్నార్థకమని భావించే పాకిస్తాన్ తప్పు తెలుసుకునో లేదా బాగుపడదామనో పనిచేస్తోందేమో ఏకంగా 12 ర్యాంకులు పైకి చేరి 80 దగ్గర నిలిచింది. చైనా 79తో ఒక్క అడుగు ముందుంది. నేపాల్ 8 స్థానాలు ఎగబాకి 99 వద్ద, బంగ్లాదేశ్ 110వ మెట్టు దగ్గర, మయన్మార్ 114 శ్రీలంక 120లో ఉంటే మన దేశం 122కు పడిపోయింది. అంతకు ముందు ఏడాది కన్నా నాలుగు స్థానాల దిగువకు చేరింది. అంటే 158 దేశాల్లో 122వ స్థానంలో వెనుకబడిపోయింది. కల్లోలిత ఆఫ్రికా దేశాల కన్నా బెటరని ఫీలవ్వాల్సిన అవసరం కూడా లేదు. చాలా ఆఫ్రికా దేశాలు మన కన్నా కాస్త సంతోషంగానే ఉన్నాయి. అంటే ఎక్కడున్నామో అర్థం చేసుకోండి. దేశంలో కోటీశ్వరులు పెరిగినంత మాత్రాన, మన జీడీపీ పెరిగినంత మాత్రాన, లక్షల కోట్ల బడ్జెట్ గొప్పలున్నంత మాత్రాన మనం బాగున్నామని త్వరలోనే సూపర్ పవర్‌గా ఎదిగిపోతున్నామని అనుకుంటే ఎలా. ప్రపంచం ఆకలిని తీర్చే సూపర్ పవర్‌గా మారాల్సిన దేశం పెట్టుబడిదారుల గుత్తాధిపత్యంతో మరో దేశాన్ని కబళించే శక్తుల పంచన చేరడంలో ఏం ఆనందముంది. భారత్‌కు బాగా సుస్తీ చేసింది. అది మంచం పట్టున మూల్గుతోంది. సంతోషంగా పెదవి విరచలేనంత కుంగుబాటులో ఉంది. ఆనందాన్ని హత్తుకోలేనంత అసహనంతో ఉంది. అందుకే వేదన చెందుతోంది. భారత్ ఎందుకు అన్-హ్యాపీగా ఉందనే ప్రశ్నకు ఓ ఆల్టర్‌నేటివ్ పత్రిక తీస్తే.. ఓ సామాజిక మాధ్యమం పేజీ తెరిస్తే.. ఓ వెబ్‌సైట్ హోమ్ పేజీని విజిట్ చేస్తేనో కాదు... టీ కొట్టు దగ్గర ముచ్చట్ల నుంచి



ఆటోల్లో, బస్సుల్లో, రైళ్లల్లో.. చివరకు ఏటీఎం క్యూలైన్లలో జరిగే నికార్సైన, నిబద్ధమైన సామాన్యుని చర్చ అందులోని ఆక్రోశం, బాధ, వేదన చూస్తే తెలుస్తుంది. ఓ కిలోమీటర్ ప్రయాణానికి అదనంగా రెండు రూపాయలు ఇచ్చుకోలేని ప్రయాణీకుడి కష్టం, ఓ రెండు వదులుకోలేని ఆటోవాలా కష్టంలో కనిపిస్తుంది. ముగ్గురి పని ఒక్కడు బండగా చేసేస్తున్న ఆఫీసు క్యాబ్‌ల్లో స్ఫురిస్తుంది. కడుపులోని బిడ్డ భవిష్యత్తు గురించి ఇప్పుడే చీకటి గదిలో ఆలోచనలో పడిన తల్లి కన్నీటి చుక్కలో విస్తరిస్తుంది. ఈ వీధిలో మనం మనలాగే బతకొచ్చా అనే పక్క మతం వాడి వేదనలో జ్వలిస్తుంది. దేశానికి వెన్నెముక రైతు ఆత్మహత్యల్లో, దేశాన్ని నిర్మించే సైన్యమైన యువత నిరుద్యోగ జీవితాల్లో తెరలు తెరలుగా పైకి తేలుతోంది. పింఛన్ కోసం ఓ వృద్ధుడు చెప్పులతో పాటు పాదాల్ని అరగొట్టుకునే నిర్లక్ష్యం జబ్బులో పెరుగుతోంది. మట్టి నుంచి ఆకాశం వరకు వేల, లక్షల కోట్ల స్కాముల్లో తేటతెల్లమవుతోంది. ఇంక సంతోషంగా చెప్పుకోవడానికి సామాన్యుడికి అవకాశమేముంటుంది. మన పక్కింటి అమ్మాయిని ఎవరో వేధిస్తుంటే అడ్డుకోవడం అటుంచి పక్కవాడు చస్తుంటే సెల్ఫీలు తీసుకుంటున్న సెల్ఫిస్టుల శకం బార్లా తెరుచుకుంటుంది. టీవీల్లో వచ్చే డర్టీ జోక్స్ చూశో, యూట్యూబ్‌ల్లో సరదా షార్ట్‌ఫిల్మ్ చూసో, చట్ట సభల్లో వింతైన వాదనల్ని వింటూనో.. నమ్మశక్యం కానీ విషయాల్ని అలవోకగా చూపించే సినిమాల్ని తిలకిస్తూనో లేదా వారి జీవితాలపై వాళ్లే జోకులేసుకుంటూ తాత్కాలికంగా ఆనందపడేశామని మోసం చేసుకునే పరిస్థితి దాపురించింది. భయాలకు, బాధలకు మందేసుకునే ప్రయత్నం కనిపిస్తోంది.

సంతోషంలో దక్షిణాసియా దేశాలలో కన్నా భారతే దిగువలో ఉండటం ఎందుకో మింగుడు పడటం లేదు. కొన్ని ఉపదేశాలు మనకు వినిపిస్తూ ఉంటాయి మతం కానీ ఆధ్యాత్మికం కానీ బాగా విస్తరించిన చోట సంతోషం తాండవిస్తుందని... ఈ లెక్కన చూసుకున్నా భారత్ బాగా ఆనందపడిపోవాలి. కానీ ఇక్కడ దు:ఖ సాగరమే ఎక్కువైందని తేలడం ఆ విషయాల్లో ఆలోచనలో పడేస్తోంది. కడుపు కాలే పరిస్థితి మరి.

బ్యాలెన్స్ ఎక్కడ ఉంది

ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో పొందిక, సామరస్యం, బ్యాలెన్స్ ఉంటే సంతోషం కిందకు వస్తుందని ఓ మంచి మాటుంది. పని గురించి మాట్లాడేసుకున్నాం కదా ఇంకా మిగిలింది సామాజిక జీవితం ఇక్కడ మనకు సామరస్యం ఎక్కడ కనిపిస్తోంది. అసహనం అనే మాట బాగా వినిపిస్తోంది విస్తరిస్తోంది. పక్కింటి నుంచి పక్కనోడి కులం, మతం, ప్రాంతం, భాషా యాసా ఇలా అనేక విషయాల్లో సామరస్యం రోజురోజుకూ నశించిపోతోంది. ఎన్నో తీవ్ర ఘటనల్ని చూస్తున్నాం. నానాటికి మనిషి కంపార్ట్‌మెంటల్‌గా ఒంటరిగా మారిపోవడం చూస్తున్నాం. అపార్ట్‌మెంట్ జీవితాలే చక్కని ఉదాహరణ. దొంగలు పడినా, హత్యలు జరిగినా తెలీనితనం పొరుగున ఉన్నవారికే ఉందంటే సామాజిక సంబంధాలు ఎంత దయనీయంగా తయారయ్యాయో అర్థం చేసుకోవచ్చు. సంతోషానికి సూచీగా సామాజిక తోడ్పాటు, భరోసా, విశ్వాసాల్ని పరిశీలించారు. మత విద్వేషం తారాస్థాయికి చేరడంతో అక్కడా భారత్‌కు మార్కులు బాగా తగ్గిపోయాయి. రంజాన్‌కు పంచే సేమ్యా, దసరాకు పంచే లడ్డూ తీపిని రుచి చూపించడం తగ్గిపోతోంది. వాదించి మరీ మీరూ వేరు వారు వేరూ అనే పాతాళాన్ని తవ్వేస్తున్నాయి అవకాశవాద రాజకీయాలు. తరగతి గదుల్లోను మూలాల్లోకి నాటేసే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. ఇక స్నేహాలెక్కడ, సంతోషాలెక్కడ. లేనిపోని అనుమానాలు, భయాలు, అక్కసుతో మనిషి లోలోన

చదువే చాయిస్‌లో లేక



సంతోషాన్ని కొలవడానికి తీసుకున్న మరో విషయం జీవితంలోని ఎంపికలు. అది చదువు, కెరీర్, పని, జీవిత భాగస్వామి ఇలా అనేక అంశాల్లో ఉంటుంది. ఇక్కడ వ్యక్తికి ఎంత స్వేచ్ఛ ఉన్నదనే విషయం ఆలోచించాల్సింది. భారత్‌లోని పరిస్థితులు ఈ వ్యక్తి స్వేచ్ఛ అనే మాటకు ప్రతికూలం. మొత్తం జీవితాన్నే ప్రభావితం చేసే... ఏం చదవాలి ఎవరిని పెళ్లి చేసుకోవాలనే విషయాల్లో పెద్దల మితిమీరిన జోక్యం, ఒత్తిడి యువతను నలిపేస్తోంది. ప్రేమ వివాహాలూ ఒకే కులం, మతం, స్థాయి అయితేనే సర్వైవ్ అవుతున్నాయి. లేకపోతే పరువు పేరిట దారుణమైన హత్యలు సాగిపోతున్నాయి. అందరూ ఇంజినీర్లే, డాక్టర్లే కావాలంటూ పెట్టిన అగ్నిపరీక్షల్లో ఎన్ని అడాల్సెంట్ జీవితాలు బూడిదైపోతున్నాయో చూస్తున్నాం. ఒత్తిడి తాళలేక ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య అనే కథనాలు రెగ్యులర్ అయిపోయాయి. ఇంజినీరింగ్ చదివిన ఓ యువకుడు తాను చదివిన, నైపుణ్యమున్న దానికి సంబంధం లేని వృత్తుల్లో కాలక్షేపం, కానించేయడం ప్రతి చోట తారసపడుతున్నదే. కొత్త వృత్తి అంటే భగ్గున మండిపడే పెద్దలున్నంత వరకు క్రియేటివ్ ఫీల్డ్‌లో కలలు కనే యువతది పెద్ద సమస్య. 'వాసు' సినిమా ఎప్పటిదో అనుకుంటే 'త్రీ ఇడియెట్స్' వరకు మంచి కథాంశంగా పనికొస్తోందీ బాధ. సమాజం కొన్ని కొలతల్ని, లెక్కల్ని మంచి జీవితం కోసం పెట్టేసింది. ప్రభుత్వ ఉద్యోగం అందులో ముందుంటుంది కానీ అందరికీ ఆ ఉద్యోగం సాధ్యమా అని మాత్రం పట్టించుకోదు. ఇక్కడే ఈ ప్రయత్నాల్లోనే కీలకమైన ప్రొడక్టివ్ వయస్సు అరిగిపోతోంది. లేట్ మ్యారేజ్ అనేది లైఫ్ చాయిస్ అనే భ్రమలో ఉన్నారు కానీ వాస్తవంగా చూస్తే యువత చాయిసెస్‌కు తగ్గ వృత్తి, ఉద్యోగం, తోడు అనేవి దొరక్కగా చివరకు అడ్జెస్ట్ అయిపోయే యాంటీ క్లైమ్యాక్స్ అవుతోన్న వ్యవహారమిది.

లెక్కల్లో అశాంతి

- దేశంలో ప్రతి అరగంటకు ఒక రేప్ జరుగుతోందని ఓ లెక్క.
- ప్రపంచంలో జరుగుతున్న పరువు హత్యల్లో ప్రతి ఐదింటిలో ఒకటి భారత్‌లోనే చోటుచేసుకుంటోంది.
- పౌష్టికాహార లేమితో బాధపడుతోన్న చిన్నారుల్లో చైనా కన్నా ఐదు రెట్లు, సబ్ సహారా ఆఫ్రికా కన్నా రెండు రెట్ల కేసుల రేట్ భారత్‌లోనే ఎక్కువ.
- కోటీ ఇరవై లక్షల మంది బాల కార్మికుల లెక్కలు బాల్యమెలా పనిచోట్లలో నాశనమైపోతుందో వివరిస్తున్నాయి.
- జీవిత కాలంలో వెనుకబాటే (68 ఏళ్లు). శిశు మరణాల రేట్ ఎక్కువే (41-1000).
- 2016గాను మానవాభివృద్ధి సూచీలో భారత్ ర్యాంకు 130. 188 దేశాలకు సంబంధించిన మానవాభివృద్ధి లెక్కల్ని ఐక్యరాజ్యసమితి వేయగా మన స్థానం అంత వెనుకబడి ఉంది.



రగిలిపోతుంటే వాడికి నవ్వేలా చిందుతుంది సంతోషం ఎక్కడ నిలుస్తుంది. ఇప్పుడో కొత్త కులం పుట్టుకొస్తోంది. అది అంతకు ముందున్న లింగ వివక్షే కానీ అప్పటి తీవ్రత కన్నా బలపడిపోతోంది. ఇప్పుడు ప్రతి విషయంలోను ఆ రెండో కులం నుంచి పోటీ తీవ్రమవడంతో కాసింత మనశ్శాంతిని పోగొట్టుకుని, పోగొడుతూ నానా ఆఫీస్ పాలిటిక్స్, ఇంట్లో ట్రిక్స్ పెరిగిపోయి ఏదో డైలీ సీరియళ్లో చూపించినట్టు క్షణక్షణం ఉక్కిరిబిక్కిరిగా జీవితాలు పోసుకుంటున్నారు. కాసే నవ్వుల్లోను కుటిలత్వమే, ఇచ్చే ట్రీట్‌ల్లోను కుయుక్తులే. మహిళలపై క్రైమ్ పెరిగిపోతోన్న విషయం తెలిసిందేగా. పెరుగుతున్న విడాకుల రేట్, మ్యారిటల్ రేప్ వైవాహిక జీవితాల దు:ఖాన్ని కళ్లకు కడతాయి. ఈ కేసులు కొన్నే అయినా మరో రకపు గృహ హింస సమస్యలు అనేవి తీవ్రంగానే ఉన్నాయనేది కాదనలేని విషయమే కదా. ఇలా ఇంటా బయటా హార్మోని దెబ్బతింటోంది.

ఈఎమ్ఐకు ఆనందం వడ్డన

పాతికేళ్ల క్రితం ఈఎమ్ఐ అనే మాట ఉందో లేదో తెలీదు కానీ ఓపెన్ మార్కెట్ వల్ల ఇప్పుడు ప్రతి దానికి ఈఎమ్ఐ లభించేలా ఉంది. ఇదే పెద్ద పేచీ అయి కూచుంది. అక్కరలేనివి కొనిపిస్తోంది. చిక్కుల్లో పడేస్తోంది. కట్టడం రోజు లేటైతే చాలు ఫోన్ వచ్చేస్తుందనే టెన్షన్‌తో స్విచాఫ్ చేసేవారు ఎక్కువే. ఇలా ఎక్కువ ఈఎమ్ఐ ఊబుల్లోకి వెళ్లిపోయేవారి జీవితాలు స్విచాఫ్ అయిపోతున్నాయి. 'కాస్ట్ ఆఫ్ లివింగ్' ఒకప్పటి మహానగరాల్లో ఓ ట్రివియల్ మాట. ఇప్పుడది చిన్న చిన్న టౌన్లలోను బాధగా మూల్గుతోన్న పెద్ద చర్చ. నిత్యావసరాల ధరలు, ఇంటి అద్దెల నుంచి ప్రతిదీ మనశ్శాంతిని మాయం చేస్తున్నాయి. చీకూ చింతా లేని సంసారాలు, భద్రమైన జీవితాలు అనేవి అరుదుగా వినిపిస్తున్న మాటలైపోయాయి. మత్తు పదార్థాలు చిత్తు చేయడమూ ఎక్కువైపోయింది.



'ఉడతా పంజాబ్'ను ప్రతి రాష్ట్రంలోను పెద్ద తెరలో చూసుకోవచ్చు. ఇవే కాదు అనేక లైఫ్‌స్టైల్ సమస్యల్లో నేటి భారతం కష్టాలు పెంచుకుంటోంది. సంతోషాన్ని తాత్కాలికం చేసుకుంటోంది.

రాజు... ప్రజ...

ఇవన్నీ వేటికవే విడివిడి సమస్యలు కావు. సంతోషానికి అడ్డంకులు కావు. ఒకదానితో ఒకటి ముడిపడిన సమస్య. వీటన్నింటినీ ప్రభావితం చేసే కీలక సమస్య ప్రభుత్వ తీరు. రాజు ఎలా ఉంటే ప్రజ అలా ఉంటుందని పాత మాటలు పక్కాగా అన్వయించుకుని చూస్తే ప్రభుత్వ విధానాలు, భావజాలాల తీరు అన్నింటిపై రిపుల్ ఎఫెక్ట్‌ను చూపిస్తున్నాయి. అవినీతి, అక్రమాల కూపంలో చిక్కుకుపోయిన వ్యవస్థలో వ్యక్తి మంచి, చెడుల గురించి సాలోచన చేసే సందర్భం, సమయం ఎక్కడ దొరుకుతుంది. పారదర్శక ప్రభుత్వాలు పౌరుల్లో విశ్వాసాన్ని, స్ఫూర్తిని పెంచుతాయి, తాత్కాలిక సమస్యలున్నా సంతోషంగా ఉండే ప్రభావాన్ని కలిగిస్తాయి. బాధ్యతాయుతంగా, ఆదర్శంగా నడుచుకునే పాలికలు ప్రజల్లో పెద్ద పెద్ద సవాళ్లనీ బలంగా ఎదుర్కునేలా చేస్తాయి. అప్పుడే ఆడుతూ పాడుతూ దేశం పనిచేసుకుపోతుంది. కానీ మన దేశం విషయానికొస్తే అవినీతి ర్యాంకుల్లో ముందుంటోంది. ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ స్కోరింగ్‌లో 40 మార్కుల దగ్గరున్నాం. పారదర్శకతలో టాప్‌లో ఉన్న దేశాలైన ఫిన్‌ల్యాండ్, స్వీడెన్, స్విట్జర్‌ల్యాండ్, నార్వే, నెదెర్‌ల్యాండ్ 90 స్కోర్ చేశాయి. ఈ దేశాలే సంతోషంలోను ముందున్నాయని వరల్డ్ హ్యాపీనెస్ రిపోర్ట్ పేర్కొంది. ప్రభుత్వాల అవినీతికి సంతోష లేమికి ఇంత డైరెక్ట్, ఇంత బలమైన లింక్ ఉంది. 2014లో మన దేశం ర్యాంకు 111. ఇప్పుడు 122. మూడేళ్లలోనే 11 స్థానాలకు దిగజారిపోయాం. అంటే ప్రభుత్వ విధానాలు ఎంత ప్రభావాన్ని చూపిస్తున్నాయో తేలిగ్గానే బేరీజు వేసుకోవచ్చు.

✦

'తొక్క్'ం కాదు..!

ఉల్లిపాయ తొక్కకు స్విట్జర్లాండ్‌లో బోలెడు గిరాకీ ఉంది. కిలో ఉల్లిపాయల రేటుకు పదిరెట్లు ధర పలికినా ఆశ్చర్యం లేదు. అదో లగ్జరీ కూడా. ఈస్టర్ పండుగ దగ్గర పడుతుందనగా సూపర్ మార్కెట్లలో ఉల్లిపాయ తొక్కల ప్యాకెట్లు దర్శనమిస్తాయి. ఓ 85 గ్రాముల ప్యాకెట్‌కు మీరు 150 రూపాయల వరకు చెల్లించాలి. ఇంత ధర పెట్టి కొని ఏం చేస్తారు వాళ్లనే డౌట్ వచ్చేసింది కదా.



స్విస్‌వాసులకు ఈస్టర్ పండుగ సందర్భంలో కోడిగుడ్లకు రంగు వేసేందుకు ఉల్లిపాయ తొక్కల కషాయాన్ని



వాడతారు. వారికి కృత్రిమ రంగులంటే ఇష్టం ఉండదు. రసాయనాల వల్ల పిల్లలకు ఇబ్బందులొస్తాయని, పర్యావరణానికి దెబ్బేనని ముందుచూపు. అందుకే ఎప్పటి నుంచో ఉల్లిపాయ తొక్కలతో రంగుల్ని తయారుచేయడం ప్రతి ఇంట ఫేవరెట్ విషయం. అయితే ఏడాది పొడవున ఉల్లిపాయ తొక్కల్ని సేకరించి కడిగి శుభ్రపరిచి నిల్వ ఉంచి ఇలా వగైరా వగైరా పనులతో చికాగ్గా ఉంటుందని ఒకేసారి కొనేస్తారు. ఇదో మంచి బిజినెస్ అయ్యింది.

మంట మసాలా కిళ్లీ



కిళ్లీకొట్టు లేని గల్లీని భారత్‌లో చూడగలమా. ఓ కిళ్లీ కొట్టును మాత్రం ఇంకెక్కడా చూడలేం. ఎందుకంటే ఇక్కడ మంట మసాలా కిళ్లీ దొరుకుతుంది. అంటే గొంతంతా మండిపోయేంత మసాలా దట్టించి కిళ్లీ చేయరు. మామూలు కిళ్లీకే మంట అంటించి చేతికిస్తారు. మీరు గటుక్కున దాన్ని నోట్లో వేసుకోవాలి. నోరు కాలుతుందన్న భయం అక్కర్లేదు. అది నాలుక మీద పడి పడగానే చప్పున చల్లారిపోతుంది. ఈలోగా సెగ తగిలిన పాన్‌కు ఎక్కడ లేని రుచొచ్చేస్తుంది. ఢిల్లీలోని ప్రదుమాన్ శుక్లా కుటుంబానికి చెందిన ఈ కిళ్లీ కొట్టు 20 ఏళ్లుగా నడుస్తోంది. కానీ వ్యాపారమే అంతగా సాగడం లేదు. తోటి కిళ్లీ కొట్ల పోటీతో ఇబ్బంది వచ్చింది. ఏడాది క్రితమో పాత కస్టమర్ వచ్చాడు. అతనెప్పుడూ నోటి పూతతో బాధపడేవాడు. అల్సర్‌లు తగ్గడంలేదు ఏదైనా మాంచి కిళ్లీ చుట్టమంటే పనిచేసే కుర్రాడు కిళ్లీకి మంట అంటించి నోటిలో వేశాడు. అద్భుతం.. వాహ్.. అని కస్టమర్ నోరు తిప్పాడు. పక్కన ఉన్న మిగతావారు ఇదేదో బాగుందే మాకూ అలా వేయమని అడిగారు. అలా అదో బ్రాండ్‌లా మారిపోయింది. ఇప్పుడు రోజుకు వంద మంట కిళ్లీలపైనే అమ్ముడుపోతున్నాయి. ఇంతకు ముందు మనం చుట్ట నిప్పును నోట్లో పెట్టుకుని చప్పరించే పొగరాయుళ్లను చూశాం. ఇప్పుడు మండిపోతున్న కిళ్లీని నోట్లో వేసుకునే పాన్‌బాబులను చూస్తున్నాం.. అంతే.



వింత లోకం

సోఫాలో ఉద్యోగం..!

వింత వింత ఉద్యోగాలున్నాయంటే నమ్మరు మీరు. ఈ అమ్మాయిని చూడండి హాయిగా సోఫాలో సేద తీరుతుందని అనుకోకండి. ఆ అమ్మాయి ఉద్యోగం చేస్తోంది. పని మధ్యలో విశ్రాంతికొచ్చిందనీ ఇంకా అనుకుంటే ఏం చేయలేం. ఆమె ఉద్యోగమే అది. రష్యాకు చెందిన ఎంజెడ్5 అనే కంపెనీ తమ సోఫాల్లో హాయిగా రిలాక్స్ అవగలరా లేదా అని తెల్సుకోడానికి ఈ అమ్మాయిని పనిలో కుదుర్చుకుంది. ఆమె చేయాల్సిందల్లా వారు వేసిన సోఫాలో కూర్చుని లేదా పడుకుని లేదా చేరగిలి ఎలాగైనా సరే కానీ అవి సుఖంగా ఉన్నాయో లేదో చెప్పాలి. ఈ అమ్మాయిని నియోగించుకోక ముందు వారు ల్యాబ్ టెస్ట్‌లు ఎలాగూ చేసేవారు కానీ ఏదో అసంతృప్తి కస్టమర్లకు రీచ్ అవుతుందో లేదోనని. అందుకే ఇదే పని మీదుండే ఓ ఉద్యోగిని పెట్టేయాలని గత నెలలో 'సోఫా టెస్టర్'కు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించారు. ఇదేదో బాగుందే అనుకుని 5 వేల మంది పోటీ పడ్డారు. వీరిలో 7గురిని షార్ట్‌లిస్ట్ చేసి చివరకు యూఫా నగరానికి చెందిన 26 ఏళ్ల అన్నా చెర్దాన్‌త్సేవాను ఎంపికచేశారు. ప్రస్తుతం మూడు నెలలు ప్రొబేషన్‌లో ఉండే అన్నాకు నెలకు 60 వేల రూపాయల వరకు భత్యమిస్తారు. ఆ తర్వాత ఆమె సేవలు నచ్చితే శాశ్వత ఉద్యోగినిగా తీసుకుంటారు. అప్పుడు జీతం కూడా ఇంకా బాగుంటుంది. ఆ అమ్మాయి చేయాల్సిన పనీ బాగుంది... జీతమూ బాగుంది కదూ. భలే ఉందే ఈ ఉద్యోగం.



సందర్భం

అమెరికా వింటోంది



అమెరికాలో ఒకప్పటి నల్ల జాతీయుల కష్టాలు మళ్లీ ఎక్కువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాత్యహంకారానికి భారతీయులూ బలవుతున్నారు. లాటినోలు, ముస్లింలు, ఏసియన్లు ఇలా శ్వేత జాతి కాని వారందరిపై వివిధ రకాల దాడులు తీవ్రమవుతున్నాయి. ఇప్పుడు వీరంతా ఏకతాటిపైకి వచ్చి వివక్షకు వ్యతిరేకంగా నినదిస్తున్నారు. పోరాటాలు చేస్తున్నారు. వీటిల్లో ఓ అమ్మాయి మాట చాలా బలంగా వినిపిస్తోంది. చాలా సూటిగా తగులుతోంది. ఆమె వలేరీ కౌర్. అమెరికా పౌర హక్కుల ఉద్యమానికి, జాతి వివక్ష వ్యతిరేక వేదికకు పదునైన ఆ గొంతుకను అమెరికానే కాదు ప్రపంచమూ జాగ్రత్తగా వింటోంది.

వలేరీ కౌర్‌కు ఆమె తాతయ్య వలస కథ బాగా తెలుసు. అమెరికాకు చేరీ చేరగానే తీసుకెళ్లి జైల్లో కుక్కిన చేదు స్వాగతం రుచి అడుగడుగునా వివక్ష రూపంలో ఆమె నాలుకకు పంచబడింది. జైలు గదిలోని చీకటి నుంచి వెలుతురులోకి వచ్చి తమ తరం వరకు అస్తిత్వ పోరాటం, మనుగడ పోరాటం చేసిన తాతయ్య కథ ఆమెకు ఎంతో స్ఫూర్తి. ఆమె తల్లి తనను కన్న వ్యథ కూడా ఆమెకు స్ఫూర్తే. కడుపులోని చీకటి, జైలు గదిలోని చీకటి నుంచి ఎలా బయట పడి జీవన పోరాటం చేసి బతకగలిగామో అలా అమెరికాలోకి వచ్చిన ఈ చీకటి రోజుల నుంచి కూడా అలానే పోరాడి జీవిద్దామని తమ కార్యకర్తలకు ఆమె చెబుతోంది. 'బ్రీత్ అండ్ పుష్' 'బ్రీత్ అండ్ పుష్' కాన్పు సమయంలో అమ్మ చిట్కా ఇది. అమెరికా నుంచి కూడా జాత్యంహకారాన్ని పారద్రోలేందుకు ఎంచుకున్న ఎత్తుగడ కూడా ఇదే. బ్రీత్.... శ్వాసిస్తూ సహిద్దాం. పుష్.... బలాన్ని కూడదీసుకుని తోసేద్దాం. ఏమంటారంటూ చేసిన ఆమె ఓ ప్రసంగం అమెరికా హక్కుల ఉద్యమాన్ని కదిలించివేసింది. ఉద్వేగాలతో కొట్టుకుంటున్న గుండె చప్పుళ్లు చప్పట్లతో కలసి వినిపించాయి.

వివక్ష ఇప్పటిది కాదు

9/11 దాడుల ప్రభావం అక్కడుండే సిక్కులపై కూడా పడింది. ముస్లింలతో పాటు తీవ్ర పరిణామాలని ఎదుర్కోబోతున్నారనే భయం మొదలైంది. బల్బీర్ సింగ్ సోధి అరిజోనాలోని మెసా ప్రాంతంలో ఒక గ్యాస్ స్టేషన్ వద్ద అమెరికన్ల కాల్పులకి బలైన తొలి సిక్కు మతస్తుడు. జాత్యోన్మాదంతో సిక్కులని వెంబడించి కొట్టేవారు. ఈ మధ్య అమెరికాలో మారిన రాజకీయ వాతావరణంతో జాతి అహంకార దాడులు మరింత తీవ్రమయ్యాయి. ఆ నిజాలని ప్రపంచానికి తెలిపేందుకు కృషిచేస్తున్నారు సామాజిక హక్కుల కార్యకర్త వలేరి కౌర్. వలేరి మూలాలు భారత్‌వే అయినా పుట్టి పెరిగింది కాలిఫోర్నియాలో. భారతీయ పంజాబీ రైతు కుటుంబానికి చెందిన కౌర్ కుటుంబం శతాబ్దం క్రితం అమెరికాలో స్థిరపడింది. ఆమె తాతయ్య అమెరికాకు వలస వెళితే అప్పట్లోనే అనుమానించి అరెస్ట్ చేశారు. ఆయన్ను విడిపించి అమెరికాలో బతికే అవకాశం కల్పించిందీ ఓ శ్వేత జాతీయుడే. కానీ ఇప్పటి పరిస్థితి అలా లేదు. చిన్నప్పుడు కుటుంబ సభ్యులు ఎన్నో జాగ్రత్తలు చెప్పి బడికి పంపించేవారు. పైచదువులపుడు అమెరికాలో సిక్కుల స్థితిగతులు ఆమెకు అవగతంలోకి వచ్చాయి. మతం-అంతర్జాతీయ సంబంధాలపై స్టాండ్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో చదివింది. హార్వర్డ్ డివినిటి స్కూల్లో లాజికల్ స్టడీస్, యేల్ న్యాయ విద్యాలయంలో పట్టా పొందింది. అప్పటి నుంచి సిక్కులపై దాడులకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టింది. పదిహేనేళ్లుగా పౌర హక్కుల కార్యకర్తగా పనిచేస్తూ జాతీయ స్థాయి ప్రదర్శనలు, ప్రచారాలని నిర్వహిస్తోంది. దీనికి కారణం జాతి అహంకార దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన బల్బీర్ సింగ్ మరణం. ఆయన వలేరీకి దూరపు బంధువు కూడా. బల్బీర్ మరణం తర్వాత అలాంటి ఘటనలు అడుగడుగునా చోటుచేసుకుంటూనే వున్నాయి. 9/11 దాడులకి సిక్కులకి ఏ మాత్రం సంబంధం లేదనే విషయాలు వెలుగులోకి రాకపోవడమే సిక్కులపై దాడులు పునరావృతమవడానికి కారణమంటారు వలేరీ. దర్శకుడు శరత్ రాజుతో కలిసి అమెరికాలోని దాదాపు 200 నగరాలలో 'డివైడ్ వీ ఫాల్' క్యాంపెయిన్‌ని నిర్వహించి సిక్కుల వాస్తవిక స్థితిగతులని తెలుసుకున్నారు. ఆ యదార్థ గాథల ఆధారంగా 2008లో ఆమె నిర్మించిన 'డివైడ్ వీ ఫాల్' చిత్రానికి వివిధ విభాగాల్లో పన్నెండుకి పైగా జాతీయస్థాయి అవార్డులు దక్కాయి. వివక్షని ప్రశ్నిస్తూ ఆ సినిమా కోసం తను రాసిన కొన్ని డైలాగులు 2008, 2016 ఎన్నికల క్యాంపెయిన్‌లలో వినిపించేవి. ఆ తర్వాత రాజుతో కలిసి సామాజిక న్యాయ సమస్యలపై వందకుపైగా డాక్యుమెంటరీలని నిర్మించింది వలేరీ. ఏలినేషన్ (2011), స్టిగ్మా (2011) లఘుచిత్రాలు, ఓక్ క్రీక్ ఇన్ మెమోయిర్(2012) విస్కాన్సిన్ ప్రాంతంలో సిక్కుల మందిరంలో చోటుచేసుకున్న కాల్పులపై రూపుదిద్దుకున్న డాక్యుమెంటరీ చిత్రాలు అక్కడి ప్రభుత్వ విధానాల్లో మార్పుతోపాటు దేశవ్యాప్తంగా సిక్కుల సామాజిక స్థితిగతుల్లో మార్పులకు దోహదపడ్డాయి. 2013లో అమెరికాలోని 13 మంది ప్రగతిశీల నాయకుల్లో ఒకరిగా 'ది సెంటర్ ఫర్ అమెరికన్ ప్రోగ్రెస్' వేదిక ద్వారా ఆమె గుర్తించబడింది. అమెరికన్ కరేజ్ అవార్డుతోపాటు 'ఏషియన్ అమెరికన్ వుమెన్ ఆఫ్ ఇన్‌ఫ్లూయెన్స్' అవార్డుని అందుకున్నారు. తనతో కలిసి పనిచేసిన శరత్ రాజుని వివాహం చేసుకుని జంటగా ఉద్యమంలో కలసి అడుగులు వేస్తున్నారు.

తెలుగు సినిమా కంచిపట్టు చీర కట్టుకుని పసుపు కుంకుమలతో కనిపిస్తున్న రోజులు. సినిమా సమకాలీన జీవితాలకు దర్పణంగా వుండాలి. స్వీట్ కోటెడ్ పిల్స్ మీద అంతర్లీనంగా సందేశంగా ఉండాలి. భావితరాల వారికి పరిష్కారం దిశగా సాగాలి. వెరసి... సినిమా పదిపదుల కాలాలు ప్రేక్షకుల మనోఫలకాల మీద నిలిచిపోవాలి. అటువంటి చిత్రమే 'మాలపిల్ల'. ఏడు దశాబ్దాల క్రితం తెలుగు చిత్రసీమలో ఓ గొప్ప సాహసోపేతమైన ముందడుగు, అభ్యుదయ కథావస్తువుల వైపు మార్గదర్శనం చేసిన చిత్రమిది. 175 నిమిషాల నిడివి ఉన్న ఈ చిత్ర ప్రభావం ఏడు దశాబ్దాలైనా ఎన్నో తరాలైనా తప్పక నిలిచి ఉంటుంది.

పంచరత్నాల

'మాలపి





'మాలపిల్ల' చిత్ర మకుటమే సంయుక్త రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. అయితే సారథీ ఫిలింస్ బ్యానరు మీద దర్శక నిర్మాత గూడవల్లి రామబ్రహ్మం గారు స్వీయ నిర్మాణంలో దర్శకత్వం వహించారు. ఆ రోజుల్లో గూడవల్లి గారంటే హడల్. ఆయన మాటంటే శిలాశాసనం. పైగా విద్యాగంధం వున్న వ్యక్తి. సమదర్శిని పత్రికతోబాటు ప్రజామిత్ర పత్రికకూ సంపాదకుడిగా సేవలందించారు. పత్రికా రచన కన్నా సినిమా చాలా పదునైన ప్రభావం చూపించగలిగిందీ అని గుర్తించిన ఆయన సంస్కరణాభిలాషిగా ఈ చిత్ర నిర్మాణానికి పూనుకున్నారు. చిత్ర కథ విషయానికొస్తే.. ఉన్నవ లక్ష్మీ నారాయణ నవల ఆధారంగా రూపొందించిన సందేశాత్మక చిత్రం అని అందరూ అనుకుంటారు. నిజమే! ఉన్నవ సంస్కరణాభిలాషి. 'మాలపిల్ల' చిత్ర కథ మాత్రం చలం గారి అముద్రితమైన కథ ఆధారంగా నిర్మించబడింది. చాలామందికీ విషయం తెలీదు. చలంగారి కథకి నగిషీలు చెక్కింది తాపీ ధర్మారావు. అందుకే 'మాలపిల్ల' అంత గొప్పగా రూపుదిద్దుకుంది.

ఓ సంఘర్షణే...

'మాలపిల్ల' పాటల్లో పి.సూరిబాబు నటగాయకుడి ప్రసక్తి ఉండితీరాలి. ఆయనది కంచు కంఠం. సినిమాలో మహాత్ముడి అనుయాయుడిగా గాంధీజీ అహింసా సూత్రాలను పాదయాత్ర చేస్తూ ప్రచారం చేస్తాడు. పి.సూరిబాబు పాడిన 'లేరా... లేరా... నిదుర మానరా...', 'కొల్లాయిగట్టితే ఏమీ... మా గాంధీ మాలడై తిరిగితే ఏమి?' బసవరాజు అప్పారావు గారి రచనలకు ఆయనే సుమధుర స్వరరచనని రంగరించి పూర్ణాయుష్షని ప్రసాదించాడు. 'మాలపిల్ల' సినిమా వాస్తవ దృక్పథంతో ప్రతి సన్నివేశంలోనూ సామాజిక స్పృహని అద్ది నిర్మించిన చిత్రం. ఈ చిత్రంలో మరో మహోన్నతమైన వ్యక్తిని గురించి మాట్లాడుకోవాలి. ఆయనే గోవిందరాజుల సుబ్బారావు. హీరోకి తండ్రి పాత్రలో కనిపిస్తాడు. వేషధారణ, వాచకంలో గాంభీర్యం, బ్రాహ్మణం ఉట్టిపడే బాడీ లాంగ్వేజీ కోటి భావాలు పలికించగల కళ్లు... ముఖ్యంగా సంభాషణలు చెప్పే విధానం అనితర సాధ్యం. ఈ మాలపిల్ల చిత్ర విజయానికి గోవిందరాజుల మరో ప్రధాన కారణం. ఆయన ఇచ్చిందే ఎక్స్‌ప్రెషన్.. ఆయన చెప్పిందే డైలాగు... అన్నంత బావుంటుంది ఆయన నటన. మాలపిల్లను జీర్ణించుకోలేని పాత్రలో జీవించాడు. వర్ణ సంకరమవుతుందని మానసిక సంఘర్షణ పడే

ఇదీ కథ

ఒక హరిజన యువతి ఒక బ్రాహ్మణ యువకుణ్ని ప్రేమించడం వలన వచ్చిన వర్ణ సంఘర్షణే ఈ మాల పిల్ల. దక్షిణాది రాష్ట్రాల్లో బ్రాహ్మణేతరులు ఆత్మగౌరవ సంరక్షణ ఉద్యమం చేస్తున్న సమయంలో గాంధీజీ హరిజనోద్ధరణ ఉద్యమం కూడా సమకాలీనంగా సాగింది. ఆనాడు దేశాన్ని పట్టి కుదిపేస్తున్న హరిజన ఉద్యమాన్ని కథావస్తువుగా తీసుకుని గుడిపాటి వెంకటాచలం, తాపీ ధర్మారావు, రామబ్రహ్మం ఆలోచనలకు అనుగుణంగా రచన చేశారు. చలం ధర్మారావు వీరిద్దరూ అర్థం పర్థం లేని ఆచారాలను అపహాస్యం చేసినవారే. ఇందుకు తోడుగా బసవరాజు అప్పారావు కళాభినివేశం తోడై సినిమాలోని పాటలకు కావ్య గౌరవం తీసుకువచ్చాడు. బ్రాహ్మణేతరుల ఆత్మగౌరవ సంరక్షణ ఉద్యమం జోరుగా సాగుతున్న ఇతర దక్షిణాది రాష్ట్రాల్లోనూ 'మాలపిల్ల' ఘన విజయం సాధించింది.

'మాలపిల్ల' గురించి మాట్లాడుకుంటున్నపుడు ముందుగా గుర్తుకొచ్చేది కాంచనమాల. కా
చెంపకు చేరడేసి కళ్లు, తెలుగు అక్షరాలను తేనెలో ముంచి చిలకరించినట్లుండే వాచకస్వ
చిత్రాల జోరులో మొట్టమొదటిసారిగా ఒక సమకాలీన సమస్యపై నిర్మించిన సాంఘిక చి
భవితను ఖాయం చేసింది. ఒక్కసారిగా దక్షిణాది రాష్ట్రాల్లోనే కాదు దేశం యావత్తూ తు
అభినయం గురించి కథలు కథలుగా చెప్పుకుంది. కాంచనమాల స్వతహాగా మంచి పాట
కలసి పాడిన 'నల్లవాడే.. గొల్ల పిల్లవాడే' సూపర్ హిట్టయ్యింది. ఈ చిత్రంలోనే కాంచన
బ్రతుకేలా...' 'వేణు మనోహర గానము...' సి.యస్.ఆర్ ఆంజనేయులు (ఆనాటి గొప్ప
మరోపాట 'ఆ మబ్బు.. ఈ మబ్బు...' ఎస్.రాజేశ్వరరావు గారితో కలసి పాడింది. ఈ పా

హారం

పిల్ల'

పాత్ర భావాలను కేవలం కళ్లల్లోనే పలికించాడు.

మరో ప్రధానమైన పాత్రధారి బ్రాహ్మణ యువకుడిగా వెంకటేశ్వరరావు. ప్రేమించిన వ్యక్తిని దూరం చేసుకోలేక, తండ్రికి ఎదురుచెప్పలేక నలిగిపోయే పాత్రలో కనిపిస్తాడు. అభ్యుదయ భావాలు గల యువకుడిగా నాలుగడుగులు ముందుకేస్తే... తండ్రి హెచ్చరిక పదడుగులు వెనక్కు తీసుకెళుతుంది. చలం, ధర్మారావు ఇద్దరూ మనసుపడి రాసుకున్న సన్నివేశాలు... మెలోడ్రామా ప్రేక్షకుల్ని కదిలించాయి. కంటతడి పెట్టించాయి. ఆ రోజుల్లో ఏదయినా సినిమా కంటతడి పెట్టించిందంటే ఆ సినిమా సూపర్ హిట్ కిందే లెక్క. ఈ సినిమాలో మనం గమనించవలసిన విషయం నటీనటులందరూ డ్రామా చెయ్యకుండా చాలా సహజంగా నటించారు. చివరిగా 'మాలపిల్ల' చిత్ర కథానాయిక కాంచనమాల దగ్గరొస్తే.. 1980 ఆ ప్రాంతంలో చెన్నై సౌత్ ఇండియన్ ఫిలిం చాంబర్‌లో... శోభన్‌బాబు 'మాలపిల్ల' సినిమా వేయించుకుని చూశారు. కాంచనమాల, వెంకటేశ్వరరావుల్ని ఆహ్వానించి మాట్లాడే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆమెకు స్పృహ లేదు. ఎక్కడో శూన్యంలోకి చూస్తోంది. ప్రశ్నకు సమాధానం... సమాధానం రాదు అని తెలుసుకున్న శోభన్‌బాబు కంటతడి పెట్టుకున్నాడు. శోభన్‌బాబుకి చాలా ఇష్టమైన నటి కాంచనమాల. ఆ మరుసటి సంవత్సరమే ఆమె మరణించారు. ఆమె జ్ఞాపకాలు కోకొల్లలు. 'మాలపిల్ల'తో పాటు శ్రీకృష్ణ తులాభారం, వీరాభిమన్యు, విప్రనారాయణ, గృహలక్ష్మీ, వందేమాతరం, మళ్లీపెళ్లి, ఇల్లాలు, బాల నాగమ్మ చిత్రాలు చేశారు కాంచనమాల. ఆ తర్వాత రెండు హిందీ చిత్రాలు (జింబో, లవ్ మ్యారేజ్) చేశారు. లక్ష్మీరాజ్యం కోరికపై 'నర్తనశాల'లో నటించినా ప్రయోజనం శూన్యం.. ఎవరూ గుర్తుపట్టరు. అప్రస్తుతమైనా ఎందుకు చెప్పవలసివచ్చిందంటే 'మాలపిల్ల' చిత్రం కాంచనమాల లేకుండా ఊహించలేం. కాంచనమాల గురించి ఆలోచిస్తున్నపుడు ఆమె జీవితం తెలిసిన వారికి ఎవరికైనా కళ్లు చెమరుస్తాయి. గుండె బరువెక్కుతుంది. మనసు మూగబోతుంది. సరే.. అసలు విషయానికొస్తే... 'మాలపిల్ల'ని క్లాసిక్ అందామా? కమర్షియల్ చిత్రమందామా? ఎప్పటికీ గుర్తుండిపోయే ఓ గొప్ప చిత్రం అని మాత్రం అని తీరాలి. చలం, తాపీ ధర్మారావు, బసవరాజు అప్పారావు, రామబ్రహ్మం, కాంచనమాల ఈ పంచరత్నాలు పొదిగిన అద్భుత హారం 'మాలపిల్ల'.

ఇమంది రామారావు
-9010133844

ంచన మాలగా...

ంచనమాల తొలి వెండితెర వేలుపుగా చెప్పవచ్చు.
ష్టత కాంచన మాల సొంతం. అప్పటి పౌరాణిక
త్రం 'మాలపిల్ల' కాంచనమాలకి బంగారు
పడి చూసింది. కాంచనమాల అందం,
గత్తె కూడా. ఆనాటి నటి గాయని సుందరమ్మతో
మాల పాడిన మరికొన్ని పాటలు 'ఏలా ఈ
ంగస్థల, సినీ నటుడు)తో కలసి పాడింది.
టలన్నీ ఆపాతమధురాలే.

అపశృతి

మంగళహారతులివ్వని దేశం ముంగిట
తడబడుతున్న అడుగుల్తో
అగాధాల్లోకి జార్చబడ్డ అతడు
అవనిపై మట్టి ముద్దలా
వెలుగువెనక నీడల్లే పడున్నాడు
స్వేఛగా తిరిగే నిత్యబానిసలా
ముగిసిన సంతల్లో మిగిలిన చీకటిలా
తోడూనీడా జోడింపు లేనిపోని
వెతల కథల ఫలితమింతే కదా? సూర్యచంద్రులు చుక్కల్లేని
అనంతాకాసం అతనిచూపులో బలీయంగా ప్రతిబింబిస్తుంది!

గాలి ఒళ్లంతా నిమిరి నిమిరి
లోగాలిలేని దేహాలిపి ముద్దాడుతుంది!
కంట్లో గుప్పిట ఒంపిన కారం
కబళించే కసాయిల వికారం
పుట్టిబయటపడక ముందు నుండీ పుట్టక
ఎదురుచూచే కౌగిట్లో బిర్రబిగిసిపోయాడు!
రేపటి పరిహారమందే దోసిళ్ల కన్నీళ్లతో
జీవసుమమాలలు అతని లొంగిన
మెడనలరించ ఫలితాన్నందాయి!!
ఇక అతనికి సూర్యోదయాస్తమయాలూ లేవు
అస్తమించిన సూర్యుడుదయిస్తూనే వున్నాడు!!
కబళించే కాలం అంచుల కావలి కావిడిలో
సూర్యోదయాలూ సూర్యాస్తమయాలూ
రైతు వెతల కథలు విరామమెరుగని శవయాత్రలే!!

-ఎల్ రాజాగణేష్

9247483700

కవిత్వం

కందిన రేకులు



తొలుత తొట్రుపడ్డా
మళ్లీ నిలబడ్డామనుకునే
క్రోటన్ పువ్వులు
మళ్లీ మళ్లీ కత్తిరిస్తుంటే
ఆవేదనతో మరింత ఎరుపెక్కాయి
స్వేచ్ఛగా యెదిగే
అడవి చెట్లను తలచుకొని
పలుచని విషాద ఛాయలు అలుముకొని
ఆశల పూవులు ఊరేసుకున్నాయి
మెత్తని రేకులు
కందిపోతున్న చోటంతా
కాలం కళ్లు చెమ్మగిల్లుతూనే వున్నాయి

-కళ్యాణదుర్గం స్వర్ణలత

98486 26114

తెలుసా

పుస్తకంలో చిన్నారి ప్రపంచం..!



- ప్రముఖ పిల్లల పుస్తక రచయితగా పేరొందిన హాన్స్ క్రిస్టియన్ యాండర్సన్ పుట్టిన రోజు ఏప్రిల్ 2ను అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవంగా జరుపుకుంటున్నారు.
- 'ది లిటిల్ మెర్‌మెయిడ్', 'ది అగ్లీ డక్లింగ్' లాంటి అత్యంత ఆదరణ పొందిన పుస్తకాలని రచించింది డ్యానిష్ రచయిత అయిన హాన్స్ క్రిస్టియన్ యాండర్సన్. ఆయన రచనల్లో దాదాపు 150 పుస్తకాలు 150 భాషల్లో తర్జుమా చేయబడ్డాయి.



- వేడుకలని నిర్వహించేందుకు ఐబిబివై ఒక్కో సంవత్సరం ఒక్కో దేశాన్ని ఎన్నుకుంటుంది. ఈ ఏడాది రష్యా ఆతిథ్యం ఇవ్వనుంది. 'లెట్ అజ్ గ్రో విత్ బుక్' (పుస్తకాలతో పెరుగుదాం) అనే మాటను చిన్నారి లోకంలో చొప్పించే ప్రయత్నం చేస్తోంది.

- పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని, ఇష్టాన్ని పెంచే దిశగా 'ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్' (ఐబిబివై) అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని ఒక వార్షిక వేడుకగా 1967 నుంచి నిర్వహిస్తోంది.
- భారతీయుల అతి పురాతన కథల పుస్తకంగా చెప్పబడే పంచతంత్ర కథలు క్రీ.పూ. 3వ దశాబ్దంలో రచించబడ్డాయి. విదేశీ వర్తకుల ద్వారా ఈ కథలు పర్షియా, అరబ్, గ్రీస్, యూరప్‌ల్లో ప్రాచుర్యం పొందాయి.



- తెలుగులో అత్యంత ప్రజాదరణ పొందిన బాలల కథల పుస్తకం చందమామ మొట్టమొదట తెలుగు, తమిళ భాషల్లో 1949 వెలువడింది. ఆ తర్వాత 13 పైగా భాషల్లో నెల వారీ మ్యాగ్జైన్లుగా చందమామ కథలు వెలువడ్డాయి.
- రెండు లక్షలకిపైగా ప్రజాదరణ పొందిన చందమామ కథల ప్రచురణల్లో వాటా పొందేందుకు 2006లో డిస్నీ ప్రయత్నించింది. జియోడేసిక్ ఇన్ఫర్‌మేషన్ సిస్టమ్స్ కంపెనీ చందమామ ప్రచురణ సంస్థని 2007లో సొంతంచేసుకుంది. అప్పటి నుంచి చందమామ పుస్తకాలు వివిధ భాషల్లో ఇ-బుక్స్, ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి.

- హ్యారీపోటర్ సిరీస్ కన్నా ముందు జె.కె. రౌలింగ్ 'హ్యారీ పోటర్ అండ్ ది ఫిలాసఫర్స్ స్టోన్' అనే పుస్తకాన్ని 1997లో రచించారు. న్యూయార్క్ టైమ్స్‌లో బెస్ట్ సెల్లర్ లిస్ట్‌లో చేరిన ఈ పుస్తకం ఎన్నో బ్రిటిష్, అమెరికన్ అవార్డులని గెలుచుకుంది.

- ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది పిల్లలని ఆకట్టుకున్న గ్రిమ్స్ ఫెయిరీ టేల్స్ నిజానికి పిల్లల కోసం రాయలేదు. అవి పెద్దల జానపద కథలుగా రూపొందినవే.
- 'యేసోప్ ఫేబుల్స్' ఇంగ్లిష్‌లో ప్రచురించిన తొలి బాలల పుస్తకం. 1484లో ఈ పుస్తకం ప్రచురించబడింది.
- 'ఏలిస్ ఇన్ వండర్లాండ్' పుస్తకం 1931లో చైనాలోని హునాన్ ప్రాంతంలో నిషేధించబడింది. చైనా వాసుల వాడుక భాష హునన్‌ను జంతువుల కథలకి వాడడం అవమానంగా భావించేవారు.

- డాక్టర్.సుసెస్ 'గ్రీన్ ఎగ్స్ అండ్ హ్యామ్' పుస్తకానికి కేవలం 50 రకాల పదాలని మాత్రమే ఉపయోగించారు.

కూలీ కొడుకు.. గూగుల్‌లో ఇంజినీర్

నెలసరి వేతనం తీసుకునే ఓ కూలీ కొడుకు ప్రతిష్ఠాత్మక సంస్థలో ఉద్యోగం సాధించాడు. ఆ స్థానాన్ని అందుకోవడం కోసం గ్రామం మొత్తం అతనికి సహాయం చేసిందట! అంతేకాదు, 'ముఖ పరిచయం కూడా లేనివారు సమయానికి ఆదుకొని మానవత్వాన్ని చాటారు' అంటూ సాయం పొందానని చెప్పాడీ కూలీ బిడ్డ. ప్రస్తుతం అతను సియాటెల్‌లోనిగూగుల్ కార్యాలయంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. అంతటి ఉన్నత స్థాయిలో ఉన్నప్పటికీ తండ్రి తీసుకున్న ఓ నిర్ణయం ఆ యువ ఇంజనీర్‌నే కాదు, అందరినీ ఆశ్చర్య పరుస్తోంది!



రాజస్థాన్‌లోని సోజత్‌కు చెందిన తేజారామ్ సంక్లా, అతని భార్య రామీదేవీ కూరగాయలు అమ్మూతూ జీవించేవారు. తల్లిదండ్రుల తోపాటు, ముగ్గురు సంతానంతో ఉమ్మడి కుటుంబం వారిది. కూరగాయలు అమ్మగా వచ్చే డబ్బు కుటుంబ పోషణకి చాలక పోవడంతో ఒక ఫ్యాక్టరీలో ఉత్పత్తుల రవాణా పనిలో చేరాడు తేజారామ్. రామీదేవి భవన నిర్మాణ కూలిగా పనిచేసేది. రెండు గదులున్న ఓ ఇరుకైన ఇల్లు వాళ్లది. సొంతిల్లు కట్టుకోవాలనేది ఆ దంపతులిద్దరి కోరిక. కుటుంబ పోషణతోపాటు తమ కలని నిజం చేసుకునేందుకు కష్టపడుతున్న తల్లిదండ్రులకి సాయపడాలనుకునే వాడు పెద్దకొడుకు రామచంద్ర.

రామ్ ప్రతిభావంతుడైన విద్యార్థి. కానీ వారి ఆర్థిక పరిస్థితి కారణంగా ఆ గ్రామంలో వున్న ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి వరకే పరిమితం అవుతుందనుకున్నాడతను. పదోతరగతి పరీక్షలో 90 శాతానికి పైగా మార్కులు తెచ్చుకున్న రామ్ ఆ కుటుంబానికి ఆశాకిరణంలా కనిపించాడు. కానీ అర్థిక పరిస్థితి అడ్డుపడింది. అతని ప్రతిభకు ప్రోత్సాహంగా రాజస్థాన్ ప్రభుత్వం స్కాలర్‌షిప్‌ని ప్రకటించినా స్కాలర్‌షిప్ కోసం తిరగడానికే సుమారుగా రెండు వేల రూపాయలు ఖర్చుచేయాల్సి వచ్చింది. ఫలితం మాత్రం దక్కలేదు.

స్థానికుల ప్రోత్సాహంతో

ఆ దశలో కోటాలోని జుడీషియల్ కోర్ట్‌లో స్పెషల్ ఆఫీసర్ పర్సనల్ లోన్ ద్వారా ఆర్థిక సాయాన్ని అందించారు. పైచదువుల కోసం రామ్ సోజత్ నుంచి పాలికి సుమారు 40 కిలోమీటర్ల దూరం ప్రయాణించేవాడు. అందువల్ల ఇంటర్‌లో మంచి మార్కులు సంపాదించలేకపోయినా పైచదువుల గురించి తెలుసుకునే అవకాశం దక్కింది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ప్రవేశం కోసం తోటి విద్యార్థులతోపాటు అతను కూడా కోటాలోని ఒక కోచింగ్ సెంటర్‌కు వెళ్లడం ప్రారంభించాడు.

అద్భుతం జరిగింది..

గట్టి పట్టుదలతో రామచంద్ర ఐఐటీలో ప్రవేశాన్ని పొందినా కౌన్సెలింగ్ ఫీజు కోసం డబ్బు ఏర్పాటు చేసుకోలేకపోవడం అతన్ని ఆందోళనకి గురిచేసింది. అప్పుడే తన జీవితంలో ఓ అద్భుతం జరిగిందనే చెప్పుకోవాలి. పరీక్ష తర్వాత అనుకోని విధంగా ఓ రోజు తన చిన్ననాటి స్నేహితుడు రామచంద్రని కలిశాడు. చిన్నతనంలో ఇద్దరూ కలిసి ఆటలాడుకునేవారు కానీ ఒకరింటికి మరొకరు వెళ్లింది లేదు. వాళ్ల తల్లిదండ్రులతో పరిచయమూ లేదు. కానీ రామచంద్ర విషయం తెలుసుకొని వాళ్ల ఇంటికి వెళ్లిన స్నేహితుడి తల్లిదండ్రులు కౌన్సిలింగ్ ఫీజు, కాలేజీ ఫీజులు ఇతర ఖర్చులన్నీ కట్టడానికి ముందుకొచ్చారు. కంప్యూటర్ సైన్సులో చేరిన రామచంద్రకి కాలేజ్‌లో ఇచ్చే అసైన్‌మెంట్స్‌ని పూర్తిచేయడానికి ల్యాప్‌టాప్ అవసరమయ్యింది. ల్యాప్‌టాప్ కొనడం తనకి అసాధారణమైన విషయమనే చెప్పాలి. ఇంటి పక్కన ఉన్న ఒకామె రామచంద్ర వద్దకొచ్చి ఆమెతో పాటు ఒక కమ్యూనిటీ సభకు రమ్మని చెప్పింది. కారణం తెలీక పోయినా ఆమె ఆహ్వానం మేరకు అక్కకి వెళ్లాడతను అక్కడ ఉన్నవాళ్లు ఎవరూ తనకి తెలీదు. అయినా వారంతా కలిసి రూ.30,000 జమచేసి ల్యాప్‌టాప్ కొనుక్కోమని ఆ డబ్బుని అందించారు. ఒక్కక్షణం ఆశ్చర్యానికి గురయ్యాడతను. ఈ విధంగా తెలియని వ్యక్తులూ తనకి సాయపడడం ఒక అద్భుతమనే చెప్పాలి. రెండో సెమిస్టర్ ఫీజుకి పరిచయం లేని వ్యక్తులే సాయపడ్డారు. అయితే కొన్ని ప్రయత్నాల తర్వాత ఎలాగోలా ఎడ్యుకేషన్ లోన్ రూ. 30,000 వార్షిక స్కాలర్‌షిప్ మంజూరయ్యింది. 2013లో రామచంద్ర ఐఐటీ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ డిగ్రీ సంపాదించాడు. తర్వాత సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా బెంగుళూరులో గూగుల్ ఇండియా సంస్థలో ఉద్యోగం దక్కింది. తనకి సాయపడిన వారికి డబ్బుని తిరిగిచ్చేందుకు వెళ్లినా వాళ్లు ఆ డబ్బుని తీసుకోడానిక ఇష్టపడలేదు. దానికి బదులుగా ఇంకో విద్యార్థికి సహాయం చేయమని చెప్పిన వారి మాటలు తనని కదిలించాయి. రామచంద్ర తండ్రి మాత్రం ఇప్పటకీ మెహందీ తయారుచేసే ఫ్యాక్టరీలో కూలిగానే పనిచేస్తున్నారు.

డబ్బు కావాలి

-ఎం.లక్ష్మి రమణ కుమారి
9391116702

ఓపికున్నంత వరకు పనిచేయడ మంటేనే ఆయనకి ఇష్టం. కొడుకు ఇవ్వాలనుకున్న విలాసవంత జీవితం కన్నా మరో ప్రతిభ గల విద్యార్థి తమ బిడ్డలా ఎదగాలనేది ఆశయం. మేలు చేసిన సమాజానికి ఎంతోకొంత తిరిగివ్వాలి కదా. హనుమంతు తలుపు తెరుచుకుని బయటకు వచ్చాడు.... ఆఫీసుకి వేళ అయిపోతోంది. హడావిడిగా నడవబోతుంటే మెట్ల దగ్గర అతని వెనకాలే ఇంకా హడావిడిగా ఒక మనిషి దిగుతున్నాడు. ఆ మనిషి భుజాన ఒక గ్యాస్ సిలిండర్. అది ఖాళీదే కాబట్టి ఎక్కువ బరువు లేదు కాబోలు, 'ఎవరంట ఎవరంట నిన్ను ఎత్తుకున్నదీ,' అని పాడుకుంటూ అవలీలగా మెట్లు దిగేస్తున్నాడు. ఆ క్రియలో పక్కనున్న హనుమంతుని కూడా పట్టించుకోకుండా తోసుకుంటూ తన పని ముందు అన్నట్లు వెళ్తున్నాడు. ఇంతలో వెనకనుంచి దాదాపు శోకాలు పెట్టుకుంటూ ఒక ఆడ మనిషి కూడా అతడిని వెంబడించి మెట్ల మార్గం పట్టింది. ఆవిడకి దారి ఇవ్వాలి కాబట్టి హనుమంతు పక్కకి జరగబోతూ ఆవిడ వైపు చూసాడు. ఆవిడ తమ పై భాగంలో ఉండే పంకజాక్షి.

'అయ్యో... అతడ్ని ఆపండి' అంది ఆవిడ కంగారుగా.

'ఏమైందండీ?' కంగారుపడుతూ అడిగాడు హనుమంతు.

సిలిండర్ తెచ్చాడు. దాని ధర ఎనిమిది వందల ఇరవై ఎనిమిది. వెయ్యి రూపాయలు ఇస్తే వంద తిరిగిచ్చి, ఇంకా చిల్లర ఇవ్వనని వెళ్ళిపోతున్నాడు' అంది పంకజాక్షి ఏడుపు గొంతుతో.

'ఆగవయ్యా బాబూ'... అరిచాడు హనుమంతు.

హనుమంతు అతని వెనకే మెట్ల మీద దూకుతూ దిగి, ఆ డెలివరీ బాయ్‌తో మాట్లాడాలని చూసాడు. గేట్ ముందు గ్యాస్ సిలిండర్ల టెంపో ఆగి వుంది. హనుమంతు పిలుపుల్ని ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా చూస్తూ డ్రైవర్ పక్కన కూర్చున్నాడు డెలివరీ బాయ్. 'మిగిలిన చిల్లర ఇవ్వవయ్యా మరీ డెభై రెండు రూపాయలు తీసుకుంటావా? కావాలంటే పది రూపాయలు తీసుకో' అన్నాడు హనుమంతు. అతని మాటలు పూర్తయ్యేలోపలే ఆ సిలిండర్ల బండి వేగంగా ముందుకు సాగి పోయింది. చేసేదేమీ లేక పంకజాక్షి వైపు నిస్సహాయంగా చూసి వెళ్ళిపోయాడు హనుమంతు. ఆఫీసుకి వెళ్ళాలి. ఆరోజు హనుమంతు చెయ్యాల్సిన పనులు చాలా ఉన్నాయి. ఆరోజే వెంకటేశ్వర్లు గారు రిటైర్ అవుతున్నారు. ఆయనకి వీడ్కోలు పార్టీ నిర్వహణా, ఆయన్ని ఆరోజు ఇంట్లో దింపి రావటం లాంటి పనులు హనుమంతుకే అప్పజెప్పారు. ఆఫీసుకి వెళ్ళాడు. పాపం వెంకటేశ్వర్లు గారి మొహం కళావిహీనంగా ఉంది. ఆయనకు వచ్చే రిటైర్మెంట్ డబ్బులు నాకు ఇవ్వమంటే నాకు ఇమ్మని ముగ్గురు పిల్లలూ ఒత్తిడి చేస్తున్నారు. ఒక వైపు రిటైర్ అవుతున్నానని బాధ, మరోవైపు పిల్లలకి మొత్తం డబ్బు ఇచ్చేస్తే రేపొద్దున డబ్బు కావాల్సి వస్తే ఎలా అన్న బాధ... వెంకటేశ్వర్లు గారి మొహాన్ని డీలా చేసేశాయి.

హనుమంతుకి ఆయన బాధ తెలుసు. పాపం ఆ ఇంట్లో వాళ్ళతో ఆయన ఇంక ఇరవై నాలుగు గంటలూ వేగాలి. ఇంట్లో శాంతి లేకుండా అక్కడే ఉండటం నరకం.

ఇదివరకు రోజుల్లో టీవీలూ, ఇంటర్నెట్లూ, సెల్ ఫోన్లూ ఏవీ లేవు. అయినా కాలం సులువుగా, ప్రశాంతంగా గడిచిపోతుండేది. ఇరుగూ పొరుగూ ఆప్యాయంగా పలకరించుకోవటం ఉండేది. ఇప్పుడు ఎన్ని వున్నా ఆత్మీయంగా పలకరించే వాళ్ళూ, మన బాధల్నీ, భావాల్నీ పంచుకునే వాళ్ళూ ఉండరు. అందువల్ల రిటైర్ అయ్యాక ఇంట్లో ఉండడం దుర్భరం అనిపించి హనుమంతు ఆఫీసులో పని చేసి రిటైర్ అయిన కొందరు మళ్ళీ ఉద్యోగం చెయ్యాలని తాపత్రయ పడ్డారు. వేరే వాళ్ళు పదివేలిస్తే కానీ చెయ్యని పనికి రిటైరయిన వాళ్ళను అయిదు వేలకే కుదుర్చుకున్నారు.

రామస్వామి గారు అట్లాగే అవసరార్థం ఒకచోట చేరారు. ఆయనకి ఆఫీస్ పనితోపాటు, ఎక్కడెక్కడికో వెళ్లి చెక్కులు తెచ్చే పని కూడా అప్పగించారు. ఒక చెక్కు వనస్థలిపురంలో, మరొకటి మియాపూర్లో వసూలు చేసుకురావాల్సి వచ్చేది. అన్ని మైళ్ళు ప్రయాణం చేసి పెద్దప్రాణం సొమ్మసిల్లి పోయేది. చివరికి నెల తిరగకుండానే మానేశాడు. పూర్తి నెల చేస్తేనే జీతం ఇవ్వాలి అంటూ, ఆ ఆఫీస్ వాళ్ళు అతనికి డబ్బులు ఇవ్వ లేదు. ఊరికే అంత కష్టం పడాల్సి వచ్చింది.

ఇంకొక రిటైరైన ఉద్యోగి రాజారావుది.... మరొక కథ. ఆయన రిటైరైనాక ఒక ఆఫీసులో చేరితే వాళ్ళు సెక్యూరిటీ డిపాజిట్ అని లక్ష రూపాయలు కట్టించుకుని, అడ్డమైన చాకిరీ చేయించుకున్నారు. అరవై ఏళ్ళ వయసులో అంత శ్రమ భరించలేక ఆయన అనారోగ్యం పాలయ్యాడు. వాళ్ళు సెలవ రోజులకి జీతం కట్‌చేశారు. 'ఇంక ఆ మిడిమేలపు కొలువులు వద్దు, మానుకో' అని అందరూ పోరారు. ఆయన రిజైన్ చేస్తానన్నాడు. ఆఫీస్ వాళ్ళు 'సరే నీ ఇష్టం, మన ఒప్పందం ప్రకారం నువ్వు ఏడాది చెయ్యాలి. మధ్యలో వెళ్ళిపోతే ఆ లక్ష రూపాయలూ వదులుకోవాలి' అన్నారు. చివరికి ప్రాణం కన్నా ధనం మిన్న కాదు అనుకుని, ఆ లక్ష రూపాయలూ వదులుకున్నాడు.

ఇవన్నీ చూసి వెంకటేశ్వర్లుకు ఏదన్నా ప్రైవేటు ఉద్యోగం చూసుకోవటానికి ధైర్యం చాలటం లేదు. ఇంట్లోనే ఉండాలన్న బాధ

ఆయన్ని పీడిస్తోంది.

సాయంత్రం వీడ్కోలు సభ ముగిశాక, పూలదండలూ, జ్ఞాపికా, శాలువా తీసుకుని ఆయన్ని ఇంటి దగ్గర దింపడానికి బయల్దేరాడు హనుమంతు. ఇద్దరూ ఆటో ఎక్కారు. మీటరు పైన ఇరవై ఇచ్చేట్లు బేరం కుదిరింది. ఇద్దరూ ఎక్కాక, ఆటో రయ్యిన బయల్దేరింది.

ఆయన్ని ఇంటి దగ్గర దింపి, వీడ్కోలు తీసుకున్నాక ఆటో బయల్దేరింది.

హనుమంతు ఇంటి ముందు ఆటో ఆగింది. మీటరు వైపు చూసాడు హనుమంతు. నూట యాభయ్ అయింది. అంటే నూట డెభై ఇవ్వాలన్నమాట.

జేబులోంచి రెండు వంద రూపాయల నోట్లు తీసి ఆటోవాలా చేతిలో పెట్టాడు. అతను మౌనంగా వాటిని తీసుకుని, గంభీరంగా ఆటో స్టార్ట్ చేశాడు.

'ముప్పై రూపాయలు తిరిగి ఇవ్వాలిగా?'

అన్నాడు హనుమంతు.

'చిల్లర ఎందుకడుగుతావు'?? అన్నాడు ఆటోవాలా చిరాగ్గా.

'ముప్పై రూపాయలు చిల్లరంటావా?' ఆశ్చర్యంతో అడిగాడు హనుమంతు.

'నువ్వు ఎంత ఇచ్చావు?' ఆటోవాలా ప్రశ్నించాడు.

'రెండు వందలు'.

'మరి రెండు వందల్లో నూట డెభై పోతే మిగిలేది చిల్లర కాక మరేం అవుతుంది?'

'నీ లెక్కలు నాకు అర్థం కావటం లేదు. రెండు వందల్లో నీకు ఇవ్వాల్సిన నూట డెభై పోను మిగిలింది ముప్పై. నీకు ఆల్రెడీ ఇరవై రూపాయలు ఎక్కువ ఇస్తూనే ఉన్నాను. నాకు ఇవ్వాల్సిన ముప్పై నాకు ఇచ్చేయ్' అన్నాడు హనుమంతు.

'చాల్లేవయ్యా.....నీలాంటి వాళ్ళను ఎక్కడా చూడలేదు' ఆటోవాలా గట్టిగా అరుస్తూ హనుమంతు ఇంకేదన్నా అడిగేలోపలే వేగంగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళిపోయాడు.

హనుమంతు నివ్వెరపోయి చూస్తూ కాసేపటికి తేరుకుని, ఇంట్లోకి నడిచాడు.

భార్య పద్మ టీ చేసి తెచ్చింది. హనుమంతు మెల్లగా తాగుతున్నాడు.

'మీ మామయ్యకి బాగా లేదుట. మధ్యాహ్నం మార్కెట్టుకి వెళితే, మీ మామయ్య కోడలు పద్మ కనపడి చెప్పింది' అంది పద్మ.

'అయ్యో ఏమైందిట'? అన్నాడు హనుమంతు.

'కడుపులో పుండు అన్నారుట'. ఆపరేషన్ చెయ్యాలిట. నిన్న ఊరు నుంచి వచ్చారట' అంది పద్మ.

'ఏ హాస్పటల్?' హనుమంతు అడిగాడు.

'లుక్ వెల్ హాస్పిటల్ అట'. 'ఇవాళ ఇంక రానివ్వరు. రేపు ఆఫీస్ నుంచి వస్తూ వెళ్ళొస్తాను' అన్నాడు హనుమంతు.

ఆరోజు రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదు హనుమంతుకి. మామయ్య కష్టయ్య అంటే హనుమంతుకి ఎంతో ఇష్టం. చిన్నప్పుడు సెలవల్లో అమ్మమ్మగారి ఊరుకి వెళ్ళటం, ఆ రోజులన్నీ ఇంకా గుర్తున్నాయి హనుమంతుకి. మామయ్యకి సైకిల్ ఉండేది. ఆ సైకిల్ మీద ఎక్కించుకుని తిప్పేవాడు. చేలగట్ల దగ్గర తాటికాయలు కొట్టించి, తాటి ముంజలు తీయించి ఇచ్చేవాడు. ఆ లేత తాటి ముంజల రుచి హనుమంతుకి ఇప్పటికీ గుర్తు. ఊళ్ళో చెరువు దగ్గరికి తీసుకెళ్ళి ఈత నేర్పించాడు. కొత్తావకాయ, మామిడిపళ్ళు, కొబ్బరి బోండాల్లో నీళ్ళ, ఒకటేమిటి, వేసవితాపం తెలియకుండా రకరకాల రుచులు.... పక్క ఊళ్ళోని సినిమా హాల్లో సినిమా కూడా చూపించేవాడు. మామయ్యంటే పిల్లలకి ప్రాణం. పిల్లలంటే మామయ్యకీ అంతే.

కాలక్రమేణా పెరిగి పెద్దవాళ్ళై, ఎవరి దోవలు వాళ్ళవి అయ్యాయి.

కొన్నేళ్ళ క్రితం మామయ్యకి అనారోగ్యం కలిగితే ఆస్పత్రిలో చేర్పించారు. అప్పుడు హనుమంతు చూడటానికి వెళ్ళాడు. హనుమంతుని చూసి మామయ్యా ఎంతో సంతోషించాడు. అక్కడ ఒకబ్బాయి టీ తెచ్చి అమ్ముతున్నాడు.

'తాగు ఇక్కడ టీ చాలా బాగుంటుంది' అని టీ తాగించాడు మామయ్య. 'ఆఫీస్ పనుల్లో బిజీగా ఉంటావు. రాలేదని నేనేం అనుకోను. వీలుంటేనే రా' అన్నాడు.

కొన్నాళ్ల క్రితం నుంచీ హనుమంతు ఊరికి పోయి రావటం తగ్గింది.

మామయ్య కొడుకు ఇక్కడే హైదరాబాదులోనే ఉంటున్నాడు. పిల్లలు పెద్దవాళ్ళైపోయారు. ఎవరి గొడవల్లో వాళ్ళుండి, ఏ శుభకార్యంలోనో అశుభకార్యంలోనో కలుసుకోవడం తప్ప రాకపోకలు కూడా ఎక్కువ లేవు.

పాపం మామయ్యా ఎట్లా ఉన్నాడో? ఎనభై ఏళ్ల వయసులో ఆపరేషన్ తట్టుకుంటాడా? వెళ్ళి చూసి రావాలి.

మర్నాడు లేచి గబగబా పనులు పూర్తి చేసుకుని ఆఫీసుకి బయల్దేరాడు. ఆఫీసులో పనంతా ముగించుకుని హాస్పిటలుకి బయల్దేరాడు. ఏటీయంలో పదివేలు డ్రా చేసాడు. మినిమం బ్యాలన్స్ పోను ఇంకా అయిదు వందలే ఉన్నాయి. వాటితోనే ఫస్ట్ తారీకు దాకా గడుపుకోవాలి.

హాస్పిటల్లో మామయ్య పేరు చెప్పగానే ఎక్కడ ఉన్నాడో చెప్పారు.

అది జనరల్ వార్డే కానీ, ఎక్కడికక్కడ తెరలు కట్టి, ఎవరికి వాళ్ళు విడిగా ఉన్నాం అనిపించేట్లు ఉంది.

మామయ్య అతడ్ని చూసి సంతోషించనూ లేదు. అట్లాగని విచారించనూ లేదు. మామూలుగా మొహం పెట్టుకుని కూర్చున్నాడు. ఎనభై ఏళ్ళు వచ్చి ఆపరేషన్ అంటే మరి మనిషి నిర్వికారంగా ఉండక ఇంకెలా ఉంటాడు? హనుమంతు నిట్టూర్చాడు.

తను తెచ్చిన పళ్ళు పక్కన ఉన్న చిన్న బల్ల మీద పెట్టాడు. జేబులోంచి పదివేలు తీసి, మామయ్య చేతిలో పెట్టాడు.

మామయ్య మోహంలో మార్పు లేదు. హనుమంతు అడిగిన వాటికి సమాధానం చెప్తున్నాడు కానీ మునుపటి ఆప్యాయత లేదు. పైగా కాస్త అసహనంగా కూడా కనిపించాడు.

కాసేపు కూర్చుని 'వెళ్ళొస్తాను మామయ్యా' అని లేచాడు హనుమంతు. మామయ్య మౌనంగా తలూపాడు.

'రేపు మళ్ళీ వస్తాను' అన్నాడు.

'ఎందుకూ'?? అన్నాడు మామయ్య చిరాగ్గా.

'ఎందుకేమిటి? నిన్ను చూసేందుకు'.

'చూసేం చేస్తావు?'

'అదేంటి మామయ్యా....నీకు మోరల్ సపోర్ట్' అన్నాడు హనుమంతు 'నాకే మోరల్ సపోర్టూ అక్కర్లేదు' అన్నాడు మామయ్య.

'అదేంటి మామయ్యా. నేను నీకు కనపడుతూ ఉంటే నీకు ధైర్యంగా ఉండదా?' అన్నాడు హనుమంతు.

'అయితే నువ్వు నాలుగు రోజులు సెలవు పెట్టుకుని ఇక్కడ ఉండు' అన్నాడు మామయ్య.

'మా ఆఫీసులో సెలవ అంత తేలిగ్గా దొరకదు మామయ్యా. అదీ గాక నిన్ననే నా పక్క సీట్ ఆయన రిటైర్ అయ్యారు. అయన సీట్లో ఎవర్నీ వెయ్యలేదు. ఆ పని కూడా నేనే చెయ్యాలి. ఇక్కడ ఉండటం కుదరదు' అన్నాడు హనుమంతు.

'పోనీ, ఓ యాభై వేలు తెచ్చివ్వు' అన్నాడు మామయ్య.

హనుమంతు నిస్సహాయంగా చూశాడు. ఈ పదివేలూ ఎన్నాళ్ళగానో కూడబెట్టినవి. ఏదన్నా అవసరం వస్తే ఉంటాయని దాచిన డబ్బు. మామయ్య ఈ డబ్బు చూసి ఎంతో సంతోషిస్తాడనుకున్నాడు. 'ఎందుకురా' అని తిరిగి ఇచ్చేస్తే, అవి తిరిగి ఇవ్వటానికి ఎంత నచ్చచెప్పాలో అనుకుని వచ్చాడు. తీరా చూస్తే మామయ్య యాభై వేలు కావాలంటున్నాడు.

'కుదరదు మామయ్యా' అన్నాడు మెల్లగా.

' యాభై వేలన్నా ఇవ్వవు. పోనీ నాలుగు రోజులు ఆస్పత్రిలో ఉండవు. ఇంక నిన్ను చూసి ధైర్యం వస్తుందంటావు' వెక్కిరింపుగా అన్నాడు మామయ్య.

'మామయ్యా నువ్వు నేను చేయలేనివి అడుగుతున్నావు' అన్నాడు హనుమంతు.

'ఏమిట్రా చెయ్యలేనివి. నీకు ఏదన్నా రోగం వస్తే ఆస్పత్రిలో చేరవా? అప్పుడు నీకు లీవ్ దొరకదా? యాభై వేలు పుట్టవా?' అన్నాడు మామయ్య.

'నీతో వాదించను' అనేసి ఊరుకున్నాడు హనుమంతు. వెళ్ళొస్తానని చెప్పి బయల్దేరాడు.

మనసంతా వెలితిగా, బాధగా ఉంది. వెంకటేశ్వర్లు గారి పిల్లలూ, ఆటోడ్రైవర్, గ్యాస్ సిలిండర్ల మనిషి, ఇంకా ఎందరెందరో.... వీళ్లంతా ఎందుకు ఇట్లా తయారయ్యారు? ఎవరికి తగ్గ ఆదాయం వాళ్లకి ఉంది. అయినా ఇంకా ఎవరో ఏదో ఇవ్వాలని ఎందుకు ఆశిస్తున్నారు? వీళ్లంతా సరే ఎనభై ఏళ్ల పండు ముసలి మామయ్యకేమైంది? ఎందుకిట్లా మాట్లాడాడు?

ఇంటికి వెళ్లి స్నానం చేసి కూర్చున్నాడు. భార్యకి చెప్పుకుని బాధ పడ్డాడు.

'ఏం చేస్తాం? డబ్బు లేంది ఏదీ జరగదు. అందుకని ఆ డబ్బుని ఏదో ఒకలాగా దక్కించుకోవాలని ఆశిస్తున్నారు' అంది పద్మ.

'డబ్బు ఏనాడో పుట్టింది. కానీ మానవ సంబంధాలు ఇంత అధ్వాన్నంగా ఆ నాడు లేవు. ఈమధ్య దీని ప్రభావం ఎక్కువ కనిపిస్తోంది' అన్నాడు హనుమంతు.

'ఆనాడు ఇన్ని సుఖాలూ, అవసరాలూ లేవు. అప్పుడు విలాసాలనుకునే ఫోన్లూ, కార్లూ, బైకులూ, చివరికి ఏసీలు కూడా అవసరాలుగా మారిపోయాయి. వీటన్నిటికీ డబ్బు కావాలి. ఆఖరికి కన్నపిల్లలు కూడా వాళ్ళ మీద ప్రేమ ఉందంటే ఊరికే నమ్మరు. దానికి తగ్గ డబ్బు కురిపిస్తేనే మన ప్రేమను నమ్ముతారు' అంది పద్మ.

'అందరూ అట్లా ఉండరుగా? ఉదాహరణకి మనమే ఉన్నాం. ఎవరినుంచి ఏం ఆశిస్తున్నాం...?? మనకున్నంతలో ఒకళ్ళకి సాయం చేయాలనుకుంటాం' అన్నాడు హనుమంతు.

'మనలాంటి వాళ్ళూ ఉన్నారు. మనకన్నా మంచి వాళ్ళూ, చాలా మంచి వాళ్ళు కూడా ఉన్నారు' అంది పద్మ నవ్వుతూ. ○



కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలుకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢ నమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒక వైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

<u>మెయిల్ అడ్రస్:</u>

snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

వ్యక్తిత్వనిర్మాణం జీవన శిల్పం

మానవజాతిని సమున్నతంగా నిలబెట్టే క్రమంలో అనేకమంది మహనీయుల కృషి గుర్తించదగింది. వారి జీవన విలువలు, వారి నడక, వారి జ్ఞానార్జనా పద్ధతి అధ్యయనం చేయటం అవసరం. అందుకు ఉపయోగ పడేవిధంగా తెలుగు పాఠకులకు వ్యక్తిత్వవికాస పాఠాలు అందిస్తున్న కత్తి పద్మారావు కృషి ప్రశంసనీయం. ఆయన రాస్తున్న వ్యక్తిత్వ నిర్మాణం సీరిస్‌లో ఇది మూడవగ్రంథం. డార్విన్, బుద్ధుడు, అంబేద్కర్‌లు ముగ్గురూ ప్రపంచాన్ని మార్చే సూత్రాలను కనిపెట్టారు. వారు తమ సిద్ధాంతాలను కనిపెట్టటానికి ప్రాణత్యాగాలకు సైతం సిద్ధపడ్డారు. వారి కాలాల్లోనే కాక తరువాత కూడా సమాజం వారి వైపు చూసింది. వారిని అనుసరిస్తుంది. ప్రపంచ వైజ్ఞానిక ప్రగతికి, డార్విన్ కనిపెట్టిన మానవ పరిణామక్రమం ముఖ్యమైంది. బుద్ధుడు మానవజాతి వికాసానికి తోడ్పడ్డాడు. కులం, అస్పృశ్యతలను రూపుమాపటానికి అంబేద్కర్ చేసినకృషి అసమానమైనది. వారి జీవితాల నుండి విలువైన పాఠాలను కూర్చి మన మనసులను వికసింపజేసే ప్రయత్నమిది.

పుస్తక విపణిలో వ్యక్తిత్వ వికాసం పేరిట వేడివేడి పకోడీల్లా వందలాది పుస్తకాలు అమ్ముడు పోతున్నాయి. మరి ఆ 'వికాసం' పుస్తకాల్లో ఏముందో వాటి పేర్లే సగం చెబుతాయి. కొన్ని మెట్లు ఎక్కితే విజయం, విజయానికి అభయం అనడంలో దాగిన 'విజయం' ఎవరికి? వ్యక్తికా? వ్యక్తి భాగమయిన సమాజానికా? వ్యక్తిగత అభివృద్ధికి, వ్యక్తిత్వ వికాసానికి సంబంధం ఏమిటి? సామాజిక బాధ్యతను ఏమాత్రం మోయకుండా కాల్పనిక జగత్తులో, క్షుద్ర సాహిత్యంలో యువతను ఉత్కంఠభరి తుల్ని చేసిన రచయితల పద్ధతికి



పుస్తకంపేరు : డార్విన్ బుద్ధుడు అంబేద్కర్
రచన : కత్తి పద్మారావు
పేజీలు : 1000
వెల :500/-
ప్రచురణ :- లోకాయత

భిన్నం ఈ రచన. సామాజిక బాధ్యతతో చేసిన కృషి పద్మారావు గారిది.

అసలు వ్యక్తిత్వ వికాసం పరిధి ఏమిటో అర్థం చేసుకోవాలి. మనిషి సంపూర్ణ మానవుడిగా ఎదగడం అని అనుకుంటే వ్యక్తిగా సమాజం పట్ల బాధ్యత కలిగి వుండాలి. పుట్టిన ప్రపంచానికి, దేశానికి ఋణపడి ఉండాలి. కన్న తల్లిదండ్రులను, తోడబుట్టిన వారిని అంటిపెట్టుకొని ఉండాలి. నిజానికి వికాసమంటే అందరినీ ప్రేమించడం. డార్విన్, బుద్ధుడు, అంబేద్కర్ ప్రపంచ మానవులు. గొప్ప పరిశోధకులు. వారి అనుభవాల సారాన్ని మనకందించటం యువతకెంతో మేలు చేస్తుంది. తెలుగులో ప్రముఖనటి సావిత్రి జీవితాన్ని, కంప్యూటర్ యుగంలో వస్తున్న మార్పులను కూడా పరిగణలోకి తీసుకొని అయన వివరించారు.

నేటి యువత షార్ట్ రూట్‌లో మరో మెట్టు ఎక్కితే విజయం సొంతమని నమ్ముతూ ఎండమావుల్ని చూసి చెంబు బోర్లేసుకుంటున్నారు. అసలు విజయం అంటే ఏమిటి? గెలుపంటే ఒక మనిషి హాయిగా, ఆనందంగా, తక్కువ సమస్యలతో, మంచి సంబంధాలతో, నలుగురి మధ్య మంచి పేరుతో, ఉన్నంతలో ఇతరులకు సహాయం చేస్తూ, ఆరోగ్యం కాపాడుకుంటూ, తన సమయాన్ని, సహనాన్ని, సమృద్ధిని తన అదుపులో పెట్టుకొని ప్రశాంతంగా జీవించడం అని ఓ కోణంలో చెప్పుకోవచ్చు. అదే ఈ పుస్తకంలో ఆవిష్కృత మయ్యింది. మహనీయుల స్వీయ అనుభవాలను మించిన పాఠం మరేముంటుంది. అందుకే కవి, రచయిత, వక్త, సామాజికవేత్త కత్తిపద్మారావు కృషి ప్రశంసనీయం.

– భవిష్య

'హొంతు'ల వారీగా మానవీయత తొణికించే కథలు

తెలుగు కథాలోకంలో 'జిల్లేళ్ల బాలాజీ' గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఆయన కథలు, ఇతర రచనలు ఇప్పటికే చాలా మంది పాఠకులకు సుపరిచితమే. తాజాగా భావోద్వేగ కథలు పేరుతో ఆయన ప్రచురించిన 'హొంతు' కథా సంపుటి అడుగడుగునా మానవీయతని తొణికిసలాడేలా చదువరులను ఆకట్టుకుంటుంది. మొత్తం పదిహేను కథలున్న ఈ సంపుటిలో తొలికథ 'బూబూ...'. ఈ కథలో లలిత అనే వివాహిత కాన్పు కోసం కన్నవారింటికి వెళ్లి అక్కడ తనబిడ్డతో పాటు మెహర్ అనే ఐదేళ్ళ వయసున్న ముస్లిమ్ బాలికను తనతో తీసుకొస్తుంది. అధిక సంతానం ఉన్న ముస్లిమ్ కుటుంబం ఒకటి తనకు చిన్నప్పుడు సొంతకూతురిలా ఎంతో ఆదరించిందని, వారు ఇప్పుడు దుర్భరపేదరికంతో ఉన్నందున వారింట్లోనుంచి ఈ అమ్మాయిని పెంచుకోవడానికి తీసుకొచ్చానని భర్త మాధవ్‌కు చెబుతుంది. ఆతనికి ఆ అమ్మాయిని తీసుకురావడం ఇష్టముండదు. ఇలా ఈ కథ కొన్ని మలుపులు తిరిగి చివరికి సుఖాంతమౌతుంది. ఈ కథనిండా మానవీయ హృదయస్పందనని రచయిత అత్యంత ప్రతిభావంతంగా చిత్రించారు. తర్వాత కథ రెండోది 'తోబుట్టువు' ఈ కథలోని సంఘటనలు ప్రతి ఒక్కరి జీవితంలోనో, కుటుంబసంబంధాలలోనో, రక్తసంబంధీకుల్లోనో ఎక్కడో ఒక చోట ఎదురయ్యేవిగా ఉంటాయి. మనసుని తడిచేసే కథ ఇది. మూడోదైన 'హొంతు' కథలో వృత్తి పనివారల ఆత్మ గౌరవాన్ని ఆవిష్కరించారు. ఇలాంటివే మరి కొన్ని కథలు ఈ సంపుటిలో ఉన్నాయి. అవి ఆ తర్వాత ఉన్న 'రాచబాట, ఎర్రతివాచీ' అనే కథలు. ఇవి కూడా వృత్తికి సంబంధించిన కథలే. కులవృత్తులకు సంబంధించిన మూలాల్లోకి వెళ్లిన

పుస్తకంపేరు : హొంతు (భావోద్వేగ కథలు)
రచన : జిల్లేళ్ల బాలాజీ,
పేజీలు: 144, ధర: రూ.120/–కాపీలకు:–
రచయిత ఇం.నెం.9-535, భైరాగి పట్టెడ, తిరుపతి–517501
మొబైల్ : 9866628639

రచయిత వాటి వేర్ల చివరి స్పందనలను కూడా సున్నితంగా స్పృశించగలిగిన తీరు ఎంతో అభినందనీయం. మనిషి నిజమైన అస్థిత్వాన్ని నిలబెట్టే కథలివి. ఆప్యాయతలూ, అనుబంధాలు మనుషుల మధ్య గాఢంగా ఉన్నప్పుడు మానవ సంబంధాలు ఎంత బలంగా ఉంటాయో 'శ్రీవారి స్వార్థం' కథలో చదవొచ్చు. దుర్గుణాలు గలవాని నుంచి కూతుర్ని కాపాడడానికి ఒక తల్లి చేసే ప్రయత్నాలను 'పరిరక్షణ' కథ ద్వారా వివరించారు. నేటి సమాజంలో ఆడపిల్లలకు రక్షణ ఇవ్వాలనే తాపత్రయంతో ఆమెను అడుగడుగునా అనుమానంతో చూసే తండ్రులకు కనువిప్పు కలిగించేదిగా 'దృష్టి' కథను భావించవచ్చు. ఈ సంపుటిలో తీవ్రవాదంపై కూడా రెండు కథలున్నాయి అవి 'నలుగురిలో ఒకడు, చీకటి నుండి వెలుగులోకి...' అనే కథలు. ఈ సమస్యని మానవీయ కోణంలో రచయిత పరిశీలించారు. మిగిలిన కథలు కూడా వేటికవే బాగున్నాయి. ఈ మధ్య కాలంలో వస్తున్న మూస కథాసంపుటాలకు భిన్నంగా మంచి కథలు అందించిన బాలాజీ అభినందనీయులు.

– బెందాళం క్రిష్ణారావు

లాంబ్ విండాలూ



కావాల్సిన పదార్థాలు

మాంసం-600 గ్రాములు
బంగాళాదుంపలు(చిన్నవి)-5
వెల్లుల్లి తరుగు-1/4 కప్పు
టమాట ముక్కలు-1 కప్పు
వెనిగర్/నిమ్మరసం-1/4 కప్పు
ఉప్పు-రుచికి తగినంత
చక్కెర-2 టేబుల్ స్పూన్లు
ఎండుమిర్చి-1/2 కప్పు
చింతపండు గుజ్జు-1టేబుల్ స్పూన్
ఉల్లిపాయల తరుగు-1 కప్పు
వెన్న - 1/2 కప్పు
నూనె-2 టేబుల్ స్పూన్లు
జీలకర్ర-1 టీ స్పూన్

తయారుచేసే విధానం

కూర తయారు చేయడానికి నాలుగు గంటల ముందు ఎండుమిర్చీ, ముప్పావు వంతు వెల్లుల్లి ముక్కలూ, జీలకర్ర, చింతపండును వెనిగర్‌లో వేసి నాననివ్వాలి. తర్వాత రెండు చెంచాల నూనెవేసి అన్నింటినీ మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. మాంసం ముక్కల్ని కుక్కర్‌లో మెత్తగా ఉడికించుకోవాలి. బంగాళాదుంపల్ని కూడా పెచ్చు తీసి విడిగా ఉడికించుకుని పెట్టుకోవాలి. వెడల్పాటి గిన్నె తీసుకుని అందులో నూనె వేడిచేసి మిగిలిన జీలకర్ర, వెల్లుల్లి తరుగు, ఉల్లిపాయ ముక్కలూ వేసి వేయించుకోవాలి. ఉల్లిపాయ ముక్కలు వేగాక టొమాటో ముక్కలు వేసి వేయించుకోవాలి. తర్వాత ఎండుమిర్చి మసాలాను వేసి కాస్త తక్కువ మంటపై ఉడకనివ్వాలి. పచ్చి వాసన పోయి నూనె పైకి తేలుతున్నప్పుడు ఉడికించి పెట్టుకున్న మాంసం, బంగాళాదుంప ముక్కల్ని కూడా వేసి రెండు నిమిషాలు ఉడకనివ్వాలి. తర్వాత వెన్న, చక్కెర, తగినంత ఉప్పుని వేసి కలిపి స్టౌ పైనుంచి దింపేయాలి.

మిర్చీ ముర్గ్

కావాల్సిన పదార్థాలు

చికెన్-600 గ్రాములు
ఉల్లిపాయ ముక్కలు-1కప్పు
టమాటా ముక్కలు-1 కప్పు
పచ్చిమిర్చి-5
గరంమసాలా-1 1/2 టేబుల్ స్పూన్
ఎండుమిర్చి-2
అల్లం వెల్లుల్లి పేస్ట్-1టేబుల్ స్పూన్
పసుపు-1 టేబుల్ స్పూన్
ధనియాల పొడి-1 టేబుల్ స్పూన్
కారం-1 టేబుల్ స్పూన్
కొత్తిమీరీ తరుగు- 1కప్పు
నూనె-1/2 కప్పు
ఉప్పు- తగినంత

మసాలాకోసం

ఎండుమిర్చి- 1/4కప్పు
ధనియాలు-3 టేబుల్ స్పూన్లు
నువ్వులు-2 టేబుల్ స్పూన్లు
గసగసాలు-1 1/2 టేబుల్ స్పూన్
కరివేపాకు రెబ్బలు-5
గరంమసాలా-1 టేబుల్ స్పూన్
మిరియాలు-1 టేబుల్ స్పూన్
వెల్లుల్లి రెబ్బలు-5
ఎండుకొబ్బరిపొడి-1/4 కప్పు



తయారుచేసే విదానం

ముందుగా మసాలా కోసం తీసుకున్న పదార్థాలన్నిటినీ మిక్సీలో వేసి పేస్ట్‌లా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఒక బాణలిలో నూనె వేడిచేసి గరంమసాలా, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, ఉల్లిపాయముక్కలు వేసి వేయించుకోవాలి. అవి వేగాక అల్లం వెల్లుల్లి పేస్టు కూడా వేయాలి. రెండునిమిషాల తర్వాత టామాటా ముక్కలు, చికెన్ ముక్కలూ వేసి వేయించుకోవాలి. అందులోనే పసుపు, కారం, ధనియాలపొడీ, ఉప్పు వేసి మరోసారి కలిపి మూత పెట్టేయాలి. మంట తగ్గించి మద్యమధ్యలో కలుపుతుండాలి. చికెన్ మెత్తపడ్డాక ముందుగా చేసుకున్న మసాలా వేసి బాగా కలిపి పచ్చి వాసన పోయే వరకు సన్నని మంటపై ఉడకనివ్వాలి. గ్రేవీలా దగ్గరపడే వరకు వుంచి స్టౌ పైనుంచి తీసేయాలి.

ఫిష్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

మసాలాకోసం

తాజా కొబ్బరి తురుము-4 కప్పులు
ఎండుమిర్చి-2
ఉల్లిపాయలు-2
వెల్లుల్లి రెబ్బులు-4
జీలకర్ర- 2 టేబుల్ స్పూన్లు
మిరియాలు-1 టేబుల్ స్పూన్
దాల్చిన చెక్క- చిన్న ముక్క
చింతపండు గుజ్జు-3 టేబుల్ స్పూన్లు
అల్లం తరుగు-2 టేబుల్ స్పూన్లు

గ్రేవీకోసం

అల్లం తరుగు-1/2కప్పు
నిలువుగా తరిగిన మిర్చి-5
దాల్చిన చెక్క-చిన్నది
కొత్తిమీర తరుగు-1/2కప్పు
ఉప్పు-రుచికి తగినంత
చక్కెర- కొద్దిగా
ముల్లులు తీసేసిన చేపముక్కలు-600గ్రాములు

తయారుచేసే విధానం

ముందుగా మసాలా కోసం తీసుకున్న పదార్థాలన్నింటినీ మిక్సీలో వేసుకుని మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. దీన్ని వెడల్పాటి గిన్నెలో తీసుకుని సమానంగా నీళ్లుపోసి పొయ్యిమీద పెట్టాలి. మిశ్రమం సగం అయ్యేవరకూ ఉడికించాలి. తర్వాత అందులో అల్లం తరుగు, పచ్చిమిర్చి ముక్కలు, కొత్తిమీర వేసి బాగా కలుపుకోవాలి. కాసేపటి తర్వాత చేపముక్కలు తగినంత ఉప్పు, చక్కెర వేసి బాగా కలిపి మూత పెట్టేయాలి. చేపముక్కలు మెత్తగా అయ్యాక దింపేస్తే ఫిష్ కర్రీ రెడీ.

చుక్కలు కలపండి



లెక్కిద్దాం...

ఇక్కడ కొన్ని పక్షులు వున్నాయి. అవి మొత్తం ఎన్నున్నాయో లెక్కించి కింద వున్న బాక్సుల్లో ఆ అంకెని సున్నా చుట్టేయండి!



లిటిల్ స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేనో బాలీవుడ్ స్టార్‌ని! ఇది నా చిన్ననాటి ఫోటో ఇంతకీ నేనెవరో చెప్పండి?

జ: సోనాక్షి సిన్హా



నీడ గుర్తించండి

పిల్లలూ! ఇక్కడ ఒక బుల్లి జోకర్ బొమ్మతో పాటు కొన్ని నీడలున్నాయి. వాటిలో జోకర్ అసలైన నీడ ఎక్కుడుందో గుర్తించి సున్నా చుట్టేయండే...

పదాలు పూరించండి

ఇక్కడ కొన్ని బొమ్మల నుంచాం. అయితే వాటి ఇంగ్లీష్ పేర్లలో ఒకటి రెండు అక్షరాలు మిస్సయ్యాయి. ఆ అక్షరాలని కలిపేస్తే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా మిస్సయిన అక్షరాలని గుర్తించి ఖాళీల్లో నింపేయండే!



జ : cart, apple, arm, bird, banana, book, card, belt, bike

దారి కనిపెడదాం

బన్నీ ఒక ఎయిర్ బెలూన్‌లో ఆలా షికారుకెళ్ళొచ్చింది. అయితే దానికి ఆ బెలూన్ నుంచి ఎలా బయటికి రావాలో తెలీడంలేదు. ఆ దారిని కనిపెట్టి బన్నీ బయటికొచ్చేందుకు సాయపడండి.



కనిపెట్టండి



ఇక్కడ కనిపిస్తున్న వ్యక్తి ముఖంలో కొన్ని పర్వతాలు, ఒక పక్షి, అమ్మాయి, బోటు, ముత్యం కూడా దాగున్నాయి. అవెక్కడున్నాయో కనిపెట్టేయండి.

హిమాలయన్ మోనాల్

పిల్లలూ! మీరు రకరకాల పక్షుల గురించి వినే ఉంటారు మరి హిమాలయన్ మోనాల్ పేరెప్పుడైనా విన్నారా...!!

-హిమాలయన్ మోనాల్ లొఫొఫోరస్ ఇమ్‌పిజెనస్ జాతికి చెందిన పక్షి. దీన్నే ఇంపెయన్ మోనాల్, ఇంపెయన్ పెజెన్ట్ అని కూడా పిలుస్తారు.

-ఇవి భారత్‌లో జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, సిక్కిమ్, అరుణాచల్ ప్రదేశ్, రాష్ట్రాలతోపాటు నేపాల్, తూర్పు ఆఫ్ఘనిస్తాన్, దక్షిణ టిబెట్, మయన్మార్ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తాయి. అతి తక్కువ సంఖ్యలో భూటాన్‌లోనూ వీటి జీవనం కొనసాగుతోంది.

-నెమలి జాతికి చెందిన మోనాల్ మన పొరుగు దేశం నేపాల్ జాతీయ పక్షి. అక్కడ ఈ పక్షిని డ్యాన్‌ఫి అని పిలుస్తారు. వారి నాణేలు, కరెన్సీ నోట్లపై మోనాల్ చిత్రాలు ముద్రించి వుంటాయి.

- నెమలి జాతిలో అత్యంత ధృఢత్వంగల పక్షిగా పిలవబడే మోనాల్ ఉత్తరాఖండ్ రాష్ట్ర పక్షిగా గుర్తించబడింది.

-ఇవి దాదాపు 70సె.మీ పొడవుంటాయి.

-ఎక్కువగా నేల మీద సంచరిస్తూ, గింజలు, విత్తనాలు, చెట్ల, బెర్రీలు, భూమిలో వుండే చిన్న చిన్న కీటకాలని ఆహారంగా తీసుకుంటాయి.

-మగ పక్షులు ముదురు నీలి, ఆకుపచ్చ, ఊదా, ఎరుపు రంగుల కలగలపుతో ప్రత్యేకంగా కనిపిస్తాయి. ప్రకాశవంతంగా వుండే ఈకల్ని కలిగుంటాయి. తల భాగంలో వుండీ చిన్న పాటి ఈకలు, గోధుమరంగు తోక, తెల్లని ప్యాచ్‌లు వీటి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

-ఆడ పక్షులు, పిల్ల మోనాల్ పక్షులు ముదురు గోధుమ రంగులో వుంటాయి.

-పుట్టిన ఏడాది తర్వాతే మగ పక్షులు ప్రకాశవంతమైన రంగుల్లోకి మారతాయి.

-ఇవి వేసవిలో ఎక్కువగా పచ్చిక బైళ్లలో సంచరిస్తాయి.

-శీతాకాలంలో అడవులు, వొంపు తేలిన వెదురు చెట్లపై గూళ్లని ఏర్పరుచుకుంటాయి.

- ఇవి ఏడాదికి ఒకసారి మాత్రమే వలస వెళతాయి.

-ఏప్రిల్ - జూన్ నెలల మధ్య నాలుగైదు గుడ్లని పొదుగుతాయి.

-హిమాచల్ ప్రదేశ్‌లో వీటి కొప్పు భాగంలో వుండే ఈకలతో అందమైన టోపీలని తయారుచేస్తారు. ఈ టోపీలు కొన్ని ప్రాంతాల్లో వారి ఆర్థిక స్థాయికి సూచిగా వాడతారు. ఇవి ఎక్కువగా వేటాడబడుతున్నాయి.

✦

ఆధారాలు

అడ్డం

1. పెళ్ళిలో వధూవరులు నెత్తిన పోసుకునేది (4)
3. మున్నుడి (4)
7. యజమాని (2)
8. ఒక తెలుగు మాసం (3)
9. గుడిసె (2)
12. ఆనకట్ట (3)
13. భర్త (3)
17. ధ్వని (2)
18. రావడం (3)
19. గేయం (2)
22. విసుర్రాయి (4)
23. రుబ్బేందుకు ఉపయోగించే రాతి పనిముట్టు (4)

పదవికాసం - 56

కూర్పు: రావెళ్ల

1		2		✿	3	4		5
	✿		✿	6	✿		✿	
7		✿	8			✿	9	
	✿	10	✿		✿	11	✿	
✿	12			✿	13			✿
14	✿		✿	15	✿		✿	16
17		✿	18			✿	19	
	✿	20	✿		✿	21	✿	
22				✿	23			

నిలువు

1. ప్రారంభించు (4)
2. సరస్వతి (2)
4. కోట (2)
5. మరణించు (4)
6. కాకి (3)
10. వెతకడం (3)
11. గుర్రం మీద స్వారీ (3)
14. పరపతికాదు ఓ పుణ్యక్షేత్రం ఉన్న ప్రదేశం(4)
15. కొయ్యతో చేసిన లావుపాటి స్తంభం (3)
16. పురుగులు (4)
20. తలగుడ్డ (2)
21. మురికిని వదిలించేది (2)

సుడోకు

4		9			6	1		
		5						2
	6		5		1	9		
7		2	6			8		3
1	4	3				2		
			4	2				
	5	8		6	7			
			8		9	3	1	
9								6

గతవారం జవాబులు

9	7	5	3	8	2	4	1	6
1	2	8	6	4	7	9	5	3
3	4	6	5	9	1	7	8	2
7	3	9	4	2	5	1	6	8
8	5	4	7	1	6	2	3	9
2	6	1	8	3	9	5	4	7
4	9	2	1	6	8	3	7	5
5	8	3	9	7	4	6	2	1
6	1	7	2	5	3	8	9	4

✿	1 భా	2 ర	తం	✿	3 పం	4 చా	స్యం	✿
5 ఆ	✿	క్ష	✿	6 మా	✿	కు	✿	✿
7 ము	ట్టె	✿	8 వా	గు	డు	✿	9 భా	10 మం
క్త	✿	11 ప	✿	డు	✿	12 వి	✿	చి
13 మా	రు	పే	రు	✿	14 స్త్రం	శా	తి	నీ
ల్యా	✿	రు	✿	15 శ్లో	✿	ఖ	✿	ళ్ల
16 ద	డ	✿	17 బో	ధ	న	✿	18 యం	ప్రా
✿	✿	19 జో	✿	నం	✿	20 కు	✿	యం
✿	21 వ	ల	దు	✿	22 త	క్కి	డి	✿



చల్ల చల్లని మల్లెలు

నోరూరే సువాసన మల్లియలది. మల్లెల్ని మిఠాయిలా చప్పరించేయాలన్నంత చల్లదనం వాటిది. మన పూలరాణి, పర్షియన్ల వరం ఈ యాస్మిన్ 'జాస్మిన్'గా ప్రపంచాన్ని తన సుగంధాల్లో మైమరిపిస్తోంది. ఆ ప్రపంచం దీని ఫ్లేవర్‌కు బాగా ఫేవరైపోయింది. అందుకే ఐస్‌క్రీమ్‌లు చేసుకుని చప్పరించేస్తోంది. మల్లెల హిమక్రీమములు మనకు మామూలు కాకపోవచ్చు కానీ ఇండోనేషియా, బ్యాంకాక్‌ల్లో మాంచి గిరాకీ ఉన్న ఫ్లేవర్. జాస్మిన్ పెర్ల్ టీని చైనా వాళ్లు కాచి వడబోస్తే దాన్ని ఇటాలియన్లు ఎత్తుకుపోయి డార్క్ చాక్లెట్ ఐస్‌క్రీమ్‌కు జత చేసేస్తున్నారు. ఫ్లోరెన్స్ నుంచి బర్మా వరకు మల్లె మత్తును స్పూనుల్తో రుచి చూసేస్తున్నాయి. కావాలంటే ఓ ఎడిబుల్ రకాన్ని ఎంచుకుని మీరు కూడా చల్లచల్లని మల్లెల్ని టేస్ట్ చేసేయండి.

Contact for Corporate Programs
Cell: 98481 90302
You have Problems?
I have Solutions !
సమస్యలతో రండి!
సక్సెస్‌తో దూసుకుపోండి...
నత్తి, డిప్రెషన్, గుండెదడ, నరాల బలహీనత, భయం, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ప్రేమ వైఫల్యం,
మద్యం, సిగరెట్లు, ఖైనీ, ఆత్మవిశ్వాసం లోపించడం, మరియు అనేక సమస్యలకు ఎంతో మంది
నా వద్దకు వచ్చి హిప్నో-సైకోథెరపీ ద్వారా పరిష్కరించుకున్నారు. సక్సెస్ అయ్యారు,
ఇక మీ వంతు, మీకు సమస్యలున్నా, సక్సెస్ కావాలన్నా భవిష్యత్‌లో స్థిరపడాలన్నా...
VIP
Vidhatha
Institute of
Personality Developmnet
34 ఏళ్ళ అనుభవంతో వ్యక్తిత్వ వికాసం రియల్ ఎస్టేట్,
ఇన్సూరెన్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు నెట్‌వర్క్ మార్కెటింగ్
ప్రతినిధులకు షాపింగ్‌మాల్స్ హాస్పటల్ సిబ్బందికి స్కూల్స్, ఇంజనీరింగ్,
మేనేజమెంట్ కాలేజిలకు, ప్రత్యేక శిక్షణ కై సంప్రదించండి
నేనున్నాను !
క్రాంతికార్
(Psychologist , Hypno-Therapist & HRD trainer)
(PhD),MSc(Psychology),MSc(Counseling Psychology), MSc(App Psy),
MA (Child Care),BSc(Psy),BA(Psy),BNat (Naturopathy & Yoga),
DY(Yoga),YCC(Yoga),MBA(HR),MA(PPM), MA(S), MA(PPS),
MLM,MA(GT), MA(Phy), BCom,HDSE & More
ప్రముఖ సైకాలజిస్ట్ & హిప్నోథెరపిస్ట్
త్రాగే వ్యక్తి కి
తెలియకుండా మందు
మాన్పించబడును.
చైల్డ్ సైకాలజీ
మీ పిల్లలో అల్లరి, టీ.వి. చూడటం, సెల్‌ఫోన్, నెట్ వాడటం, బద్ధకం,
కోపం, మాట వినకపోవటం, ఎక్కువ అయిందా?
చదువు తగ్గిందా? కాలేజీకని చెప్పి తిరిగి తిరిగి వస్తున్నారా?
మీ పిల్లలు హీరోలు కావాలనుకుంటున్నారా?
websites : www.krantikar.blogspot.in
www.vidhatha.in, www.kranthikar.com
www.facebook.com/krantikar ye
Hyderabad : 93 93 11 2021, Vizag : 9440 633 610